
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




ఉష్ణోగ్రత (అంచనా) 18-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	38	29
తెనాలి	38	28
నరసరావుపేట	38	28
బాపట్ల	37	29
రెంటచింతల	37	27
చీరాల	37	29



జిల్లా పరిషత్
విభజనకు అడుగులు

- పరిపాలన పునర్వ్యవస్థీకరణకు చర్యలు
- పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ నుంచి కమిషనర్‌కు లేఖ
- మూడు జిల్లాలకు మండలాల సర్దుబాటు
- 15 నెలల్లో జడ్పీటీసీల ఎన్నికలు

గుంటూరు సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌ను విభజించనున్నారు. పరిపాలన పునర్వ్యవస్థీకరణకు పం చాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రతి జిల్లాకు పరిషత్ ఏర్పాటు కానుంది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిషత్‌లకు మండలాలను సర్దుబాటు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ త్వరలోనే ప్రారంభంకానుంది. పంచాయతీరాజ్ డైరెక్టర్ విభజన ప్రక్రియకు సంబంధించి ఆ శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలో 57 మండలాలు ఉన్నాయి. కొత్త జిల్లాల్లో ఉన్న మండలాల ఆధారంగా జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేయనున్నారు. 2026 సెప్టెంబరులో జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించాలి. షెడ్యూల్ ప్రకారం అయితే ఎన్నికలకు 15 నెలలే గడువు ఉంది. అంతకు ముందే పునర్వ్యవస్థీకరణ పూర్తి చేయాల్సి ఉంది.



ముగియనున్న జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం

జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం 15 నెలల్లో ముగియనుంది. ఎన్నికల నాటికి విభజిత జిల్లాల వారీగా పరిషత్‌ల ఏర్పాటు ప్రక్రియను పంచాయతీరాజ్ శాఖ ప్రారంభించింది. కొత్త జెడ్పీ కార్యాలయాల ఏర్పాటుకు ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభిస్తే ఎన్నికల నాటికి ఒక కొలిక్కి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. జెడ్పీ పాలకవర్గం గడువు వచ్చే ఏడాది సెప్టెంబరుతో ముగియనుంది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు అధికారులు, ఉద్యోగుల సర్దుబాటు, కార్యాలయాల భవనాలు, సమావేశపు మందిరాలు, అధికారులకు సంబంధించిన గృహాలు, అతిథి గృహాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందు కోసం భవనాలను ఎంపిక చేయాలి. గుంటూరు జిల్లా పరిషత్‌కు అన్ని వసతులు, కార్యాలయాలు, మీటింగ్ హాల్ ఉంది. పల్నాడు, బాపట్ల జిల్లాల పరిషత్‌లకు అయా వసతులు కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రస్తుత జెడ్పీటీసీ సభ్యులు కోరుతున్నారు.

మండలాల విభజన ఇలా..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న 57 మండలాల్లో పల్నాడు జిల్లాకు 28, బాపట్ల జిల్లాకు 12, గుంటూరు జిల్లాకు 18 మండలాలు కేటాయించారు. గుంటూరు రూరల్ మండలాన్ని గుంటూరు ఈస్ట్, వెస్ట్ రెండు మండలాలుగా విభజించారు. దీంతో గుంటూరుకు ఒక మండలం పెరిగినట్లయింది. 2022 ఏప్రిల్‌లో జిల్లాల పునర్విభజన జరిగింది. అయితే జిల్లా పరిషత్‌ను విభజించలేదు. ఉమ్మడి గుంటూరు కిందే పరిషత్ నిర్వహిస్తున్నారు. గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచే పరిపాలన కొనసాగుతోంది. జిల్లా పరిషత్ పాఠశాలలు, మండల పరిషత్ కార్యాలయాల పాలన జెడ్పీ కార్యాలయం కేంద్రంగానే నిర్వహిస్తున్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ఆస్పత్రి నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

పనులపై సమీక్షలో మంత్రి సత్యకుమార్‌యాదవ్

మంగళగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో మంత్రి లోకేశ్ చొరవతో రూ.138 కోట్లతో నిర్మిస్తోన్న వంద పడకల ఆస్పత్రి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. ఆస్పత్రి పనులపై స్థానిక ఆటోనగర్‌లోని ఏపీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్షించారు. పనులను వేగవంతం చేసి వచ్చే ఏడాది నాటికి రోగులకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న భారత ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్, ఎండీ పీఎస్ గిరీషా, చీఫ్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నేడు ఏఎన్‌యూలో యోగాంధ్ర

10 వేల మందితో ఆసనాలకు ఏర్పాట్లు

పెదకాకాని, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర-2025లో భాగంగా బుధవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి జిల్లా, వర్సిటీ అధికారులు సంయుక్తంగా ఏర్పాట్లు చేశారు. వర్సిటీ క్రీడా ప్రాంగణంలో ఉదయం 6:30 గంటల నుంచి యోగా వేడుకలు జరగనున్నాయి. ఇందు కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాలలతో పాటు, అనుబంధ కళాశాలలకు చెందిన సుమారు 10వేల మంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొంటారన్నారు.

ఎరువుల నిల్వలు.. పుష్కలమేనా!



ముమ్మరంగా ఖరీఫ్ పనులు

- నిల్వలపై యంత్రాంగం కసరత్తు
- కొరత తలెత్తకుండా ముందస్తు సన్నద్ధతపై దృష్టి పెట్టేనా!
- కృత్రిమ కొరతపై ప్రభుత్వం ఇప్పటికే హెచ్చరికలు

వానలు ముందుగానే పలకరించాయి. ఖరీఫ్ సీజన్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అన్నదాతలు సేద్యానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టారు. సాగు పనులు ఓ వారం ముందుగానే ప్రారంభమవుతాయనే అంచనాల నేపథ్యంలో సంబంధిత వ్యవస్థలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. జిల్లాల వారీగా రెండు సీజన్లకు కలిపి కావాల్సిన ఎరువుల పరిమాణం ఎంత అనే లెక్కలతో పాటు ప్రస్తుతం నిల్వ ఉన్నదెంత అనే గణాంకాలను కూడా సవివరంగా తెప్పించుకుంది. దానికి అనుగుణంగానే ప్రస్తుతం నిల్వలు సమృద్ధిగానే అందుబాటులోనే ఉన్నాయని, దశల వారీగా ఎరువుల నిల్వలు పెంచుకుంటూ పోతామని అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ పనులు మరో వారంలో పూర్తి స్థాయిలో ఊపందుకోనుండగా అన్నదాతలు ఒక్కసారిగా ఎరువుల కొనుగోలు మీద దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఎరువుల కొరత తలెత్తకుండా యంత్రాంగం పకడ్బందీ ప్రణాళిక రూపొందించి తదనుగుణంగా అడుగులేస్తేనే మార్కెట్‌లో ఎరువుల కృత్రిమ కొరత తలెత్తకుండా ఉండే అవకాశముంది.



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాగు ప్రారంభం నుంచి ఎరువుల సమృద్ధిగా ఉండడం అనేది చాలా కీలకం. ఏటా సీజన్ ప్రారంభంలో పుష్కలంగా ఉన్నట్లు కనబడే ఎరువుల నిల్వలు స్వల్ప కాలంలోనే పూర్తయి అన్నదాతలకు కష్టాలు తప్పని పరిస్థితి ఎదురవుతూనే ఉంది. గత ప్రభుత్వంలో ఎరువుల నిల్వల విషయంలో ఓ ప్రణాళిక లేకుండా వ్యవహరించడంతో మొత్తం వ్యవస్థే గాడి తప్పింది. మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులను సహకార సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు విక్రయించాల్సి ఉంది. కానీ, ఈ పద్ధతిని గత ప్రభుత్వం దాదాపుగా భ్రష్టు పట్టించింది. ఎరువుల కోసం ప్రైవేటు వ్యాపారుల దయాదాక్షిణ్యాల మీదనే ఆధారపడే పరిస్థితి తీసుకొచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం ఎరువుల నిల్వలను సమృద్ధిగా ఉంచడంపై మే నెల చివర నుంచే కసరత్తు ప్రారంభించింది.

గత ప్రభుత్వంలో దళారీలకు పండగ

సీజన్ పనులు ముమ్మరంగా సాగుతున్న దశలో కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టించి

(మిగతా 8వ పేజీలో)

మూడు జిల్లాల్లో నిల్వలు ఈ విధంగా..

బాపట్ల జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కుగాను కావాల్సిన ఎరువుల నిల్వల మొత్తం పరిమాణం 53,000 మెట్రిక్ టన్నులు కాగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలు 28,000 మెట్రిక్ టన్నులుగా ఉంది. ఇందులో యూరియా 15,000 టన్నులతో అత్యధిక వాటా కాగా, 9,000 టన్నుల నిల్వలతో కాంప్లెక్స్‌ది తర్వాత స్థానంగా ఉంది. డీఏపీ, పొటాష్, ఎస్ఎస్‌పీ పొటాష్ నిల్వలు కూడా సమృద్ధిగానే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో సీజన్ మొత్తానికి యూరియా నిల్వలు 24,000 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా అందుబాటులో ఉన్న నిల్వలు 17,000 మెట్రిక్ టన్నులుగా ఉంది. అదే విధంగా కాంప్లెక్స్ పరిమాణం 16,000 టన్నులు అవసరం కాగా ఉన్న నిల్వ 12,000 టన్నులుగా ఉంది. పల్నాడు జిల్లా వ్యాప్తంగా మొత్తం 65,000 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా ప్రస్తుతం నిల్వల రూపంలో ఉన్నది 35,000 టన్నులుగా ఉంది.



విద్యార్థులకు కిట్‌లను పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్

ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

- పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలి : మంత్రి మనోహర్

తెనాలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, క్రీడలు, ఉపాధ్యాయుల అర్హతల విషయాల్లో ప్రైవేటు పాఠశాలలకంటే ప్రభుత్వ పాఠశాలలే మిన్నగా ఉన్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడు తూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు. ఆకర్షణలకు లోనై పిల్లలను ప్రభుత్వ పాఠశాలలను వదిలి, ప్రైవేటు వైపు తల్లిదండ్రులు చూస్తున్నారన్నారు. జూలై 5న అన్ని పాఠశాలల్లో జరిగే సమావేశాలకు తల్లిదండ్రులు హాజరై తమ పిల్లల భవితకు సూచనలు చెయ్యాలని కోరారు. తక్కువ ధరకే విద్యార్థుల కోసం రైతులు బియ్యాన్ని ప్రభుత్వానికి అందించారని, వారి మేలు మర్చిపోలేమన్నారు.

రాజకీయాలకు తావులేకుండా కిట్లు..

రాజకీయ ముద్రలు, రంగులు లేకుండా యూనిఫారం, బ్యాగ్‌లు, పుస్తకాలు అందిస్తున్నామన్నారు. ఇకపై పాఠశాలల్లో రాజకీయాలు ఉండవని, గంజాయి దరిదాపులకు కూడా రానివ్వమన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తితో పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచితంగా విద్యా కిట్లు అందిస్తోందన్నారు. పిల్లల భవిష్యత్ సరిగా లేకుంటే, మనం ఎంత సంపాదించినా అది నిరుపయోగమవుతుందన్నారు. కిట్ల పంపిణీ అనంతరం పదిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి నగదు హామతులను స్థానిక కౌన్సిలర్ మానసరెడ్డి మంత్రి ద్వారా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం.. ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభం

- ఎక్కువగా సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ అనర్హత అర్జీలే
- హౌస్‌హోల్డ్ నుంచి విభజించాలని విజ్ఞప్తులు

8

జగన్ తీరుపై కేడర్‌లో అసహనం

- పరామర్శల పర్యటనలపై అసంతృప్తి
- నేడు రెంటపాళ్లకు వైసీపీ అధినేత రాక.. పోలీసుల ఆంక్షలు
- నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు ప్రభుత్వానికి ఏమి సంబంధం అంటున్న ప్రజలు

8

ముగ్గురు కౌలు రైతులు ఆత్మహత్య

లోపలి పేజీలో

గుంటూరు మీదగా చర్లపల్లి, నరసాపూర్, తిరుపతి, జల్నాకు ప్రత్యేక రైళ్లు

6

ఐదేళ్లుగా నీటిలోనే వంతెన

ఈ-4 రోడ్డులో తుప్పు పడుతున్న ఇనుము

తుళ్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా గత టీడీపీ ప్రభుత్వం 360 కిలోమీటర్ల మేర భారీగా రోడ్ల నిర్మాణం చేపట్టింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ రాజధాని పనులను ఆపేసింది. ఈ క్రమంలో ఈ-4 రోడ్డు పనులు కూడా గత ఐదేళ్ల నిలిచిపోయాయి. దొండపాడు నుంచి మంత్రుల బంగ్లాల పక్కగా వెళ్లే ఈ రోడ్డులో జల రవాణా కోసం కాల్వ ఏర్పాటవుతుంది. అందుకు తుళ్లూరు శివారులో పెద్ద వంతెన నిర్మాణానికి అప్పట్లో సిద్ధమయ్యారు. ఇందుకోసం టన్నుల కొద్దీ ఐరన్ వాడి పై వరకు దిమ్మెలను తీసుకొచ్చారు. ఆ తర్వాత పనులు నిలిచిపోవడంతో ఆ ఇనుము అప్పటి నుంచి నీటిలోనే నానుతుంది. కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణ పనులు చేపట్టినా ఈ-4 రోడ్డులో నీటిలోని ఐరన్‌తో ఉన్న వంతెన పనులు గుర్తించి పట్టించుకోవడంలేదని రైతులు విమర్శిస్తున్నారు.



నీటిలో నానుతున్న బ్రిడ్జికి వాడిన ఐరన్

నేడు గుంటూరుకు జాతీయ మహిళా కమిషన్

జడ్పీలో జన్ సున్వాయికి అర్చన మజుందర్ హాజరు

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళ కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్ బుధవారం గుంటూరులో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి జడ్పీ సమావేశం మందిరంలో జరిగే జన్ సున్వాయి కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఫిర్యాదులు స్వీకరించి మహిళల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు జిల్లా కరెక్షనల్ హోంని సందర్శించి అక్కడ ఉన్న 21 మంది బాధితులను పరామర్శిస్తారు. సాయంత్రం 6 గంటలకు సామాజిక పథకాల మహిళ లబ్ధిదారులతో సమావేశం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు జిల్లా అధికారులతో సమావేశమౌతారు.

అమరావతి పనుల్లో వేగం పెంచాలి

అధికారులకు ఏడీసీ సీఎండీ ఆదేశాలు

విజయవాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాజధానికి భూములిచ్చిన రైతులకిచ్చే ప్లాట్లను అభివృద్ధి చేసి వాటిల్లో మౌలిక సదుపాయాల విషయంలో అధికారులు శ్రద్ధ చూపాలని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం జోన్-2, 7ను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. జోన్-7లో కొండమరాజుపాలెం, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామాల్లో 2.6 వేల ఎకరాల్లో చేపట్టాల్సిన లేఅవుట్ల అభివృద్ధికి ఇంజినీరింగ్ అధికారులు సమాయత్తం కావాలన్నారు. రాజధాని రైతులకు అభివృద్ధి చేసి ఇవ్వాల్సిన లేఅవుట్లలో రోడ్లు, మంచినీటి, భూగర్భ, వర్షపునీటి పారుదల వ్యవస్థ నిర్మాణాలకు ముడిసరుకును కొనుగోలు చేయాలని సంబంధిత చీఫ్ ఇంజినీరు సీహెచ్ ధనుంజయను ఆదేశించారు. అనంతరం జోన్-1లోని అబ్బరాజుపాలెం, నెక్కల్లు, తుళ్లూరు, శాఖమూరు గ్రామాల పరిధిలో 2.85 వేల ఎకరాల్లో జరుగుతున్న మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. ఏడీసీ చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకర్, ఐపీడీ హెడ్ కేవీ గణేష్‌బాబు, ఎస్ఈ ఆర్ హనుమంతరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, డీఈ పీ వెంకటేశ్వర్లు అధికారులు పాల్గొన్నారు.



రైతులకిచ్చే ప్లాట్ల స్థలాలను పరిశీలిస్తున్న ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి

అసత్య ప్రచారాలు చేస్తే మహిళలే తిరగబడతారు

● ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి తల్లి సంతోషంగా ఉండేలా తల్లికి వందనం పథకాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అమలు చేస్తున్నా రని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద నగదు జమచేస్తుంటే.. వైసీపీ నేతల తప్పుడు, అసత్య ప్రచారాలను వి ద్యార్థులు, తల్లిదండ్రులు నమ్మే పరిస్థితి లేదన్నారు. తల్లికి వందనంపై విషం చిమ్ముతున్నారని, రూ.2 వేలు లోకేశ్ జేబులోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగ జారుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. దీనిని నిరూపించాలని నారా లోకేశ్ సవాల్ విసిరితే వైసీపీ నేతలు తోకలు ముడిచారని ఎద్దేవా చేశారు. పసలేని ఆరోపణలు ప్రభుత్వం, లోకేశ్‌పై చేస్తే మహిళలు, విద్యార్థులే తిరగబడే రోజు వస్తుందన్నారు. తల్లికి, చెల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్ నేడు తల్లికి వందనం గురించి మాట్లాడటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. వైసీపీ పాలనలో రూ.13 వేలే ఇచ్చారని, మిగిలిన రూ.2వేలు జగన్ జేబులోకి పోయాయా, లేక తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా అని ఎమ్మెల్యే యరపతినేని ప్రశ్నించారు. విద్యార్థులకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు, కందిపప్పులో కూడా కమిషన్ తీసుకున్న నీచ చరిత్ర వైసీపీదేనని మండిపడ్డారు.

గుంతల రోడ్ల కష్టాలకు కూటమి ప్రభుత్వం చెక్

తెనాలి-నారాకోడూరు రోడ్డును ప్రారంభించిన మంత్రి మనోహర్

తెనాలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్లను గుంతలమయం చేసి, జనాన్ని గత వైసీపీ సర్కారు ముప్పుతిప్పలు పెడితే.. కూటమి ప్రభు త్వం వాటిని సరిచేసి, కొత్త రోడ్లు వేసి జనం కష్టాలను తీర్చిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలి - నారాకోడూరు మధ్య రోడ్డును ఇటీవల రూ.3 కోట్లతో అభివృద్ధి చేశారు. ఈ రోడ్డును మంగళవారం మంత్రి మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏ రోడ్డు చూసినా చెరువును తలపించిందన్నారు. కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం కింద రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. తెనాలి-నారాకోడూరు తరహాలో తెనాలి - మంగళగిరి మధ్య కూడా రూ.650 కోట్లతో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి రంగం సిద్ధం చేశామని వెల్లడించారు. తమ ప్రభుత్వం వచ్చాక ప్రధాన రహదారుల నుంచి చిన్నపాటి గ్రామీణ రోడ్లను కూడా అభివృద్ధి పరిచామని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం కేవలం సంక్షేమాన్నే పరమావధిగా భావిస్తే.. కూటమి ప్రభుత్వం మాత్రం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విజన్ ఉన్న నేత ముఖ్యమంత్రి పీఠంపై ఉంటే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవనడానికి ఏడాదిలో జరిగిన అభివృద్ధే నిదర్శనమన్నారు. తెనాలి, కొల్లిపర మండలాల్లోని గ్రామీణ రోడ్ల మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులకు కూడా నిధులు తీసుకొస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కౌన్సిలర్ మానసారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



రూ. 3 కోట్లతో అభివృద్ధి పరిచిన తెనాలి-నారాకోడూరు రోడ్డుకు సంబంధించి శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్

వైసీపీ నేతలు అంబటి, అప్పిరెడ్డికి నోటీసులు

● నేడు రెంటపాళ్ల పర్యటనకు అనుమతి లేదు

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి పట్టాభిపురం పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. బుధవారం సత్తెనపల్లిలోని రెంటపాళ్ళ గ్రామంలో గతేడాది మృతి చెందిన వైసీపీ కార్యకర్త నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్మోహన్‌రెడ్డి వస్తున్నారు. జగన్ పర్యటనకు షరతులతో కూడిన అనుమతి పోలీసులు ఇచ్చారు. జగన్ వాహనంతో పాటు మరో రెండు వాహనాలకు, గ్రామంలో వందమందికి మించి గుమిగూడడానికి వీల్లేదని షరతులు విధించారు. అయితే జగన్‌తో పాటు పరామర్శకు వెళ్లేందుకు గుంటూరు నుంచి అంబటి, అప్పిరెడ్డి పెద్ద ఎత్తున జన సమీకరణ చేస్తున్నట్లు పోలీసు వర్గాలకు సమాచారం రావడంతో.. వారికి ముందస్తుగా నోటీసులు జారీ చేశారు. అంబటి ఇంటికి వెళ్లగా ఆయన అప్పటికే నిద్ర పోయారని సిబ్బంది సమాధానం ఇచ్చారు. ఇక అప్పిరెడ్డి రాత్రి తన గన్‌మెన్‌ను వదిలి వ్యక్తిగత పని ఉందంటూ వెళ్లిపోయారు. దీంతో పోలీసులు వారి ఇళ్లకు నోటీసులు అంటించారు. వారి ఇళ్ల వద్ద నిఘా ఉంచారు. తమ కళ్లుగప్పి రెంటపాళ్ళ వెళ్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ అధికారులు హెచ్చరించారు. వీలైతే అంబటిని హౌస్ అరెస్టు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

కోర్టుకు జంట హత్యల కేసు నిందితులు



నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్న పోలీసులు

మాచర్లటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం గుండ్లపాడు జెవిశెట్టి సోదరుల జంట హత్యల కేసులో నిందితులను పోలీసులు విచారించి మంగళవారం కోర్టుకు హాజరుపరిచారు. ఈ కేసులో ఇప్పటికే ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి ప్రశాంత్ రిమాండ్ విధించారు. గుంటూరు జిల్లా జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలను విచారించేందుకు వెల్దుర్తి పోలీసులు కోర్టులో పిటిషన్ వేయగా రెండు రోజుల అనుమతి లభించింది. దీంతో సోమ, మంగళవారాలు విచారించి మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి ప్రశాంత్ రిమాండ్‌కు పంపారు. రూరల్ సీఐ నఫీజ్ బాషా ఎస్కార్ట్‌తో నిందితులు ఆరుగురిని గుంటూరు జిల్లా జైల్‌కు తరలించారు.

రాత్రి చంపి, పొద్దున్నే దండ వేసినట్లుంది జగన్ పర్యటన

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అరాచక శక్తులను ప్రోత్సహించడానికే వైఎస్ జగన్ పర్యట నలు చేస్తున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. గుంటూరులోని తన గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళకు చెందిన ఉప సర్పంచ్ నాగమల్లేశ్వరరావు బెట్టింగ్‌లు కాసి, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. ఎన్నికల ముందు వైసీపీ గెలుస్తుందని తప్పుడు నివేదికలు ఇవ్వడం వల్లే అతను బెట్టింగ్ కాచి.. అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడన్నారు. వైఎస్ జగన్ బుధవారం రెంటపాళ్ళల్లో నాగమల్లేశ్వరరావు విగ్రహావిష్కరణకు రానుండటం రాత్రి చంపి పొద్దున్నే దండ వేసినట్లుగా ఉందన్నారు. తన వల్లే నాగమల్లేశ్వరరావు చనిపోతే ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి జగనే వస్తున్నాడన్నారు. నాగమల్లేశ్వరరావు చనిపోవడం బాధాకరమన్నారు. అతనిపై రెండు కేసులు ఉన్నాయని, మనిషి చని పోయిన ఏడాది తర్వాత నానా హంగామా చేస్తూ సత్తెనపల్లికి జగన్ ఓదార్పు యాత్ర చేస్తున్నాడన్నారు. నాగమల్లేశ్వరరావు చనిపోయింది బెట్టింగ్ వల్లేనని, అప్పటికే జగన్ అధికారంలో ఉన్నాడని గుర్తుచేశారు. జగన్ రెంటపాళ్ళ పర్యటనను విరమించుకోవాలని కన్నా సలహా ఇచ్చారు. సత్తెనపల్లి నియోజక వర్గ టీడీపీ నేతలు ఉన్నారు.

'సంగం డెయిరీ' విత్తనాల పంపిణీ

● రైతులకు మేలైన విత్తనాలు: చైర్మన్ ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్(చేబ్రోలు), జూన్, 17(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సంగం విత్తన పరిశోధన విభాగం కృషి చేస్తుందని సంస్థ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం సంగం డెయిరీ రూపొందించిన మేలైన వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డెయిరీ విత్తన పరిశోధన విభాగం ఆధ్వర్యంలో ఎస్ఎస్ఆర్-2(సంగం ఆరోగ్య), ఎస్ఎస్ఆర్-4(సంగం అర్జున్) విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. వరితో పాటు ఎస్ఎస్‌బీ-2(సంగం వీర), మినుము, ఎస్ఎస్‌జీ-3, సంగం భీమ్ పెసర విత్తనాలను రైతులకు పరిచయం చేశారు. వీటితో పాటు కూరగాయ పంటలైన సంగం గోదావరి, చెట్టుచిక్కుడు, సంగం రుద్ర టమాటా హైబ్రీడ్ విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ సంగం డెయిరీ అభివృద్ధిలో భాగస్వాములైన రైతులకు మరింత మేలు చేయాలనే లక్ష్యంతో డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ నేతృత్వంలో విత్తన పరిశోధన విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరంతరం పరిశోధనలు చేసి, కొత్త రకం విత్తనాలను తెగుళ్లను తట్టుకుని, అధిక దిగుబడులు ఇచ్చే విధంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ బీపీటీ, 5204, సర్టిఫైడ్ విత్తపాలు, ఫౌండేషన్ విత్తనాలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు 93984 23590 నంబరుకు సంప్రదించాల్సిందిగా సూచించారు. ఎండీ పి.గోపాలకృష్ణన్, వివిధ విభాగాల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సంగం వరి విత్తనాలు పంపిణీచేస్తున్న చైర్మన్ నరేంద్ర

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి

మేడికొండూరు, జూన్17(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మేడికొండూరు మండలం పేరేచర్లలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పేరేచర్లకు చెందిన కట్టెపోగు నాగరాజు(32) సోమవారం మధ్యాహ్నం క్వారీ గుంత వైపు నడుచుకుంటూ వస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయి.. గల్లంతయ్యాడు. గమనించి స్థానికులు బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుం డా పోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఈతగాళ్లను రప్పించి సోమవారం సాయంత్రం వరకు గాలించినా నాగరాజు ఆచూకీ లభ్యం కాకపోవడంతో చీకటి పడడడంతో గాలింపు నిలిపివేశారు. మంగళవారం రెస్క్యూ టీంతో గాలింపు చేపట్టగా నాగరాజు మృతదేహం బయటపడింది. మృతుడికి భార్య గర్భిణి, మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కట్టెపోగు నాగరాజు కరడుగట్టిన టీడీపీ కార్యకర్త. గత ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం అహర్నిశలు పనిచేసిన నాగరాజు మరణ వార్త విని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. నాగరాజు మరణం పార్టీకి తీరని లోటు అని మాజీ వైస్ ఎంపీపీ పాములపాటి శ్రీనివాస్ సంతాపం తెలిపారు.



నాగరాజు(ఫైల్)

పౌరుల మౌనం.. దేశానికి ప్రమాదం

● కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

గుంటూరు(తూర్పు), జూన్ 17(ఆంధ్రజ్యోతి): బాధ్యత కల్గిన పౌరుల మౌనం.. దేశానికి ప్రమాదమని.. పెనుమాక నాగేశ్వర్ చేసిన విమర్శ సబబేనని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ జిల్లా సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో పెనుమాక నాగేశ్వర్ రచించిన 'మన మౌనమే మన శత్రువు' కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ పాల్గొని, సంపుటిని ఆవిష్కరించారు. తొలి ప్రతిని పరుచూరి అజితకు అందజేశారు. సభకు అధ్యక్షత వహించిన పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పెనుమాక కవిత్వంలో అసహనం కనిపిస్తుందన్నారు. సాహితీవేత్త గోటేటి లలితాశేఖర్ కవితా సంపుటిని సమీక్షిస్తూ సరళమైన భాషలో బలమైన భావాలను పెనుమాక వ్యక్తం చేశారని పేర్కొన్నారు. రచయిత డాక్టర్ కొగంటి విజయ్‌బాబు మాట్లాడుతూ పెనుమాక శైలి సంభాషణ పద్ధతిలో కొనసాగి పాఠకులను నేరుగా పలకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివప్రసాదు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



మన మౌనమే మన శత్రువు కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ రమణ యశస్వీ తదితరులు

తల్లుల సంతోషంతో జగన్‌కు నిద్ర కరువైంది : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అమలుతో జగన్‌కు కంటిమీద కునుకు కరువైందని, తన ఊహకు అందని విధంగా చంద్రబాబు ప్రతి హామీని పక్కా ప్రణాళిక, నిజాయితీతో అమలుచేస్తుండటం మింగుడుపడటం లేదని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. అక్కసుతోనే తన నీలి మీడియా, వైసీపీ నేతలతో కూటమి ప్రభుత్వం, మంత్రి లోకేశ్‌పై విషప్రచారం చేయిస్తున్నారని దుయ్యబట్టారు. తల్లుల సంతోషాన్ని, విద్యార్థుల జీవితాలు బాగుపడటాన్ని జీర్ణించుకోలేని భిన్న మనస్తత్వం జగన్‌ది అని విమర్శించారు. జగన్ హయాంలో 42 లక్షల మంది విద్యార్థులకు అమ్మఒడి ఇస్తే, నేడు కూటమి ప్రభుత్వం 67.27లక్షల మందికి తల్లికి వందనం ఇవ్వడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో మరణించిన వైసీపీ కార్యకర్త నాగమల్లేశ్వరరావు పలు కేసుల్లో నిందితుడని తెలిపారు. నాగమల్లేశ్వరావుని టీడీపీ వేధించింది అనడం జగన్, వైసీపీ బూటకపు ప్రచారం మాత్రమేనని కొట్టిపడేశారు. అంత ర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతమైతే చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి మంచిపేరు వచ్చి, జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్ఠ పెరుగుతుందన్న ఈర్ష్యతోనే జగన్ సత్తెనపల్లి కేంద్రంగా శవ రాజకీయాలకు సిద్ధమయ్యాడని ప్రత్తిపాటి దుయ్యబట్టారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

గుంటూరు మీదగా చర్లపల్లి, నరసపూర్, తిరుపతి, జల్నాకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ పెరుగుతున్న దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, నరసపూర్, తిరుపతి, జల్నాలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. (07233) చర్లపల్లి - నరసపూర్ ప్రత్యేక రైలు జూలై 5 నుంచి 2026 మార్చి 28 వరకు ప్రతి శనివారం రాత్రి 7.50 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం ఏడు గంటలకు నరసపూర్ చేరుకొంటుంది. (07234) నరసపూర్ - చర్లపల్లి ప్రత్యేక రైలు జూలై 6 నుంచి వచ్చే ఏడాది మార్చి 29 వరకు ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. (07609) జల్నా - తిరుపతి ప్రత్యేక రైలు జూలై 7 నుంచి వచ్చే ఏడాది మార్చి 30 వరకు ప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 10.45కి తిరుపతి చేరుకొంటుంది. (07610) తిరుపతి - జల్నా ప్రత్యేక రైలు జూలై 8 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి మీదగా మరుసటి రోజు మధ్యాహ్నం 3.50కి జల్నా చేరుకొంటుందన్నారు.

బుద్ధిష్టులకు పవిత్ర ప్రదేశం అమరావతి

● నేపాల్ బౌద్ధ సమాఖ్య అధ్యక్షుడు నూర్బు తుండుషెర్పా



జాస్తి వీరాంజనేయులును సన్మానిస్తున్న నేపాల్ బౌద్ధ సమాఖ్య అధ్యక్షుడు నూర్బు తుండుషెర్పా

గుంటూరు సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి బుద్ధిష్టులకు పరమ పవిత్ర ప్రదేశంగా భావిస్తామని నేపాల్ బౌద్ధ సమాఖ్య అధ్యక్షుడు నూర్బు తుండు షెర్పా (తుప్టెన్ జిన్పా) పేర్కొన్నారు. నేపాల్ రాజధాని ఖాట్మండులో నూర్బు తుండు షెర్పాతో అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్, అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూ ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మంగళవారం భేటీ అయ్యారు. అమరావతి విశిష్టతను, బౌద్ధ శిల్ప సంపదను, ధ్యాన బుద్ధ ప్రాజెక్టు విశిష్టతను వివరించారు. అమరావతి కి రావాలని నూర్బు తుండుషెర్పాను ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూర్బు తుండుషెర్పా స్పందిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల నుంచి అమరావతి కి బుద్ధిష్టులు వచ్చి ప్రార్థన చేసుకొని వెళ్తారని, అక్కడ సౌకర్యాలను బాగా మెరుగుపరచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. త్వరలో ఒక బృందాన్ని అమరావతికి పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జాస్తి వీరాంజనేయులును నూర్బు తుండుషెర్పా సన్మానించారు.

55,109 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 58,672 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 55,109 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,590 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11500
334	9500	13400	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13000	334	9800	13500
273	10000	12400	నెంబరు. 5	10000	13400
341	10000	13400	273	10000	13000
4884	---	---	341	10000	13800
సూపర్ 10	---	---	సూపర్ 10	10000	12800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000	తేజ	10000	14400
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	13400
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13500
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

జోడు గుర్రాల్లా సంక్షేమం, అభివృద్ధి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొందని, సంక్షేమం, అభివృద్ధి రెండు జోడు గుర్రాల్లా పరుగులు తీస్తున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన ఇద్దరికీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ. 2.50 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు బాధితులకు అందించామని వెల్లడించారు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసిన వెంటనే మంజూరుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.



ప్రసంగిస్తున్న అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్

మాతృ, శిశు మరణాల నియంత్రణ కోసం ఆర్‌సీహెచ్ 2.0

● ఆరోగ్య శాఖ ఏడీ డాక్టర్ అనిల్ కుమార్ వెల్లడి

గుంటూరు మెడికల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో మాతృ, శిశు మరణాలు భారీగా తగ్గించేందుకు కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ పక డ్బందీ చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ కేవీఎస్ అనిల్ కుమార్ వెల్లడించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో రిప్రొక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్ (ఆర్‌సీహెచ్) 2.0 పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా వైద్యులు, పారా మెడికల్ సిబ్బందికి నిర్వహించిన హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమంలో ఆయన మంగళవారం ముఖ్య అతిథిగా ప్రసంగించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ పైలెట్ ప్రాజెక్ట్‌లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధులుగా డాక్టర్ రాకేష్ శర్మ, నిషాంత్ శర్మ, యూనిసెఫ్ నుంచి అర్జిత్‌సేన్ గుప్తా తదితరులు హాజరయ్యారు.

అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ మాతృ మరణాల రేట్ (ఎంఎంఆర్), శిశు మరణాల రేట్ (ఐఎంఆర్) నియంత్రణతో పాటు నవజాత శిశువుల, గర్భిణీ, బాలింతల ఆరోగ్య సంరక్షణ కోసం ఆర్‌సీహెచ్ ప్రాజెక్ట్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ రాకేష్ శర్మ, నిషాంత్ శర్మ, అర్జిత్‌సేన్ గుప్తాతో పాటు డిప్యూటీ డైరెక్టర్ కే శివశంక ర్‌బాబు, యూనిసెఫ్ కన్సల్టెంట్ జీ.నాగేంద్ర, ఐటీ స్పెషల్ టీం ప్రతినిధి పి వినయ్‌కుమార్ తదితరులు వైద్య సిబ్బందికి వివిధ అంశాలను పవర్ పాయింట్ ద్వారా వివరించడంతో పాటు శిక్షణ నిర్వహించారు. కార్యక్ర మంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ అన్నపూర్ణ, ఎన్‌సీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ బీఎస్ఎస్ రోహిణి రత్నశ్రీ, డీపీఎంవో డాక్టర్ బీ లక్ష్మానాయక్, డీపీవో సైమన్‌రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కృష్ణకుమారి, గైనకాలజీ, పీడియాట్రిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీ విద్యార్థికి పీహెచ్‌డీ

గుంటూరు (విద్య), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లయిడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని ఫిజిక్స్ విద్యార్థి వారాధి రవితేజకు యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో మంగళవారం పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రవిజేత పరిశోధనకు ఫిజిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ మోడెం శ్రీనివాసులు గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. విద్యార్థి పరిశోధనలో భాగంగా మొత్తం 3 ఎస్‌సీఐ ఇండెక్స్ జర్నల్స్‌లో పేపర్స్ పబ్లిష్ చేశారని వెల్లడించారు. ప్రస్తుతం ఆయన విజ్ఞాన్స్ వర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మీడియా సెంటర్‌లో అసిస్టెంట్ మీడియా మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. డాక్టరేట్ పొందిన రవితేజను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థి రవితేజను అభినందిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

మాదల శకుంతల నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌కు డాక్టరేట్


ఈదర హిమబిందు

గుంటూరు విద్య జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక తారకరామా నగర్ లోని మాదల శకుంతల భాస్కర్ నర్సింగ్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న ఈదర హిమబిందుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు కళాశాల కార్యదర్శి మాదాల చైతన్య మంగళవారం తెలిపారు. బాలింత మహిళలు, పిల్లల ఆరోగ్య అంశాలపై ఆమె పరిశోధన చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య, కళాశాల పూర్వ కార్యదర్శి నామినేని కోటేశ్వరరావు అభినందించారు

హిందూ ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలకి...


పొనుగుపాటి మౌనిక

గుంటూరు విద్య, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అమరావతి రోడ్డులో గల హిందూ ఫార్మసీ కళాశాల ఫార్మకాలజి డిపార్టుమెంటు అసిస్టెంట్ ప్రొఫెసర్ పొనుగోటి మౌనికకు కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్ కాలేజి ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్, ప్రిన్సిపల్ గుంటుపల్లి చక్రవర్తి పర్యవేక్షణలో "ఖెల్లిన్, మోరిన్ హైడ్రేట్ డైయురిటిక్, యాంటీయురోలిథియాటిక్ సామర్థ్యాన్ని ఇథిలీన్ గ్లైకాల్ ప్రేరిత యురోలిథియాసిస్ అనే అంశంపై విస్టార్ ఎలుకలలో పరిశోధన చేశారు." ఈ పరిశోధన గాను డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదన్‌రావు, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మకాలజీ హెచ్.ఒ.డి. డాక్టర్ దేసు బ్రహ్మ, శ్రీనివాస రావు తదితరులు మౌనిక అభినందించారు.

నగరంలో 30 పోలీస్ యాక్ట్

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున అనుమతి లేకుండా ర్యాలీలు, నిరసనలు, దర్నాలు నిషేదిస్తున్నట్లు ఈస్ట్, వెస్ట్ డిఎస్పీలు అబ్దుల్ అజీజ్, అరవింద్‌లు తెలిపారు. ఈస్ట్ పరిధిలోని పాతగుంటూరు, కొత్తపేట, లాలాపేట, వెస్ట్ సబ్-డివిజన్ పరిధిలోని అరండల్ పేట, నగరంపాలెం, పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో 30 యాక్ట్ అమలులో ఉందన్నారు.

జీఎస్‌టీ వసూళ్లకు సహకరించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీఎస్టీ(రాష్ట్ర పన్నుల) వసూళ్లు మరింత మెరుగ్గా జరిగేలా రిజిస్ట్రేషన్స్, రిటర్న్స్, కలెక్షన్స్‌కు అన్ని ప్రభుత్వ శాఖలు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తి స్థాయిలో సహకారం అందించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో జీఎస్‌టీ వసూళ్లపై రాష్ట్ర పన్నుల శాఖతో జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర పన్నుల అదాయం పెంపుదలలో భాగంగా జిల్లాలో గూడ్స్, సర్వీస్ రంగాల నుంచి జీఎస్టీ సక్రమంగా వసూలు జరిగేలా రాష్ట్ర పన్నుల శాఖకు జిల్లా శాఖలు సహకరించాలన్నారు. జీఎస్టీ పన్ను చెల్లించని వ్యాపారుల నుంచి రికవరీ చేయడానికి బ్యాంకులు అవసరమైన సమాచారాన్ని జీఎస్టీ శాఖకు అందించాలన్నారు. మైనింగ్, రవాణ వంటి రంగాలలోని వ్యాపారులు పన్ను ఎగవేతకు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్ర ఆదాయం పెంపుదలకు కాంట్రాక్టర్లు స్థానికంగా వనరుల సేకరణను ప్రోత్సహించేలా దిశ నిర్దేశం చేయాలన్నారు. జీఎస్టీ (రాష్ట్ర పన్నుల) గుంటూరు డివిజన్-1 జాయింట్ కమిషనర్ డీ.శ్రీలక్ష్మి, డివిజన్-2 జాయింట్ కమిషనర్ బీ.గీతామాధురి డివిజన్ పరిధిలోని సర్కిల్స్ వారీగా ఉన్న గూడ్స్, సర్వీస్ రంగాలకు చెందిన పన్ను వసూళ్ళు, జీఎస్టీ వసూళ్ళు మెరుగుదలకు ప్రభుత్వ శాఖల నుంచి అందించాల్సిన సమాచారం, సహకారంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులు, జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి బసు, నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనరు ఓబులేషు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్ రెడ్డి, పంచాయితీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, జలవనరులు, అర్ అండ్ బీ, వైద్యారోగ్యశాఖ, మున్సిపల్, విద్యుత్, మైనింగ్, పీసీబీ, పంచాయితీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నగరంలో నేషనల్ సిల్క్ ఎక్స్ పో

● ఐదు రోజుల పాటు ప్రదర్శన, అమ్మకం


నేషనల్ సిల్క్ ఎక్స్ పోలో చీరలను ప్రదర్శిస్తున్న చిత్రం

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ కమ్ సేల్ -2025 గుంటూరు నగరంలో మంగళవారం ప్రారంభమయింది. స్థానిక రింగ్‌రోడ్డు లోని సిద్ధార్థ కన్వెన్షన్ సెంటర్‌లో ఐదు రోజుల పాటు వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించనున్నారు. ఈ వస్త్రాలు వేసవి కాలానికి, వివాహాది శుభకార్యాలకు అనువుగా ఉన్నాయి. భారతీయ సంప్రదాయ వస్త్రధారణకు సరికొత్త అనుభూతిని కలిగిస్తాయి. దేశంలోని విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మేళవింపుతో పలురకాల మగ్గాల ఉత్పత్తులను ఒకే వేదిక మీదకు తెచ్చి నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ పేరిట వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో తయారైన వేలాది రకాల పట్టు, కాటన్, డిజైనర్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తాలు వంటి వాటిని 50 శాతం వరకు తగ్గింపు ధరకు విక్రయించేందుకు నిర్ణయించినట్టు ఎక్స్‌పో నిర్వాహకులు వెల్లడించారు. వివిధ రాష్ట్రాల్లో వస్త్ర తయారీదారుల నుంచి నేరుగా సేకరించిన వస్త్రాలు ప్రదర్శనలో ఉంచామన్నారు. మహారాష్ట్ర వారి పైథాని సిల్క్ చీరలు, కర్ణాటక వారి బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదా సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్ వారి చందేరి అండ్ మహేశ్వరి సిల్క్ చీరలు, పశ్చిమబెంగాల్ వారి బలూచారి, జమ్దాని, టాంగైల్, ఢకాయ్ చీరలతో పాటు ఇతర రాష్ట్రాల చీరలు ప్రదర్శనలో ఉంచామని నిర్వాహకులు ప్రకటించారు. బిహార్ వారి బగల్పూర్ సిల్క్ చీరలు, గుజరాత్ వారి సంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ చీరలు, పటోలా చీరలు, తమిళనాడు వారి ప్రసిద్ధ కంజీవరం అండ్ ఎంబ్రాయిడరీ పట్టు చీరలు, జమ్మూ కశ్మీర్ వారి తాబి సిల్క్ చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

బీసీ హాస్టల్స్ మెనూ ఛార్జీలు పెంచాలి


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తదితరులు

గుంటూరు (విద్య) జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు, బీపీ మండల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. అమరావతి రోడ్డులోని ఆలా ఆసుపత్రిలో 'బీసీ హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు' గోడపత్రిక ఆవిష్కరణ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యుక్త వయసు ఉన్న విద్యార్థులకు కేవలం రోజుకు 50 రూపాయలతో ఎటువంటి పౌష్టిక ఆహారాన్ని ఇవ్వగలమని ప్రశ్నించారు. ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లికి వందనం కార్యక్రమం లాగా హాస్టల్ విద్యార్థులకు కూడా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఓ.వెంకట్ యాదవ్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు జి.సురేష్, వెటర్నరీ యూనివర్సిటీ ఇన్‌చార్జీ జే.ఎజ్రా, ఇతర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు

ఏపీలో నంది అవార్డులు పునరుద్దరించాలి


మాట్లాడుతున్న దిలిప్‌రాజా

గుంటూరు(తూర్పు), జూన్ 17(ఆంధ్రజ్యోతి) : ఏపీలో నంది అవార్డులు పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని సినీ దర్శకుడు దిలిప్ రాజా కోరారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఓ హోటల్లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా నిలిచిపోయిన ప్రక్రియను ప్రారంభించేలా కార్యచరణ రూపొందించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా జ్యూరీని నియమించాలని కోరారు. నంది అవార్డులతో పాటు సినీ రంగానికి విశిష్ట సేవలందించిన వారి పేరు మీద ప్రత్యేక అవార్డులు ఇవ్వాలని సూచించారు. అవార్డుల ఎంపికలో రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సినిమాటోగ్రఫీ మంత్రిని కలిసి వినతి పత్రాలు అందజేస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఎఫ్‌డీసీ చైర్మన్ పదవిని భర్తీ చేయాలన్నారు. సమావేశంలో నటుడు మిలటరీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ అవసరం


మాట్లాడుతున్న డీవీఈవో జే.పద్మ

గుంటూరు (విద్య), జూన్ 17 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ వృత్తి విద్య కళాశాలలో అమలు చేస్తున్న కోర్సులు మరింత పకడ్బంధీ గా నిర్వహించాలని విద్యార్థినీ, విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడాలని జిల్లా ఒకేషనల్ ఆఫీసర్ (డీవీఈవో) జే.పద్మ సూచించారు వృత్తి విద్యా కళాశాలల ప్రిన్సిపల్స్‌తో గుంటూరులోని ప్రభుత్వ వృత్తి విద్య కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్షలో ఆమె మాట్లాడారు. కళాశాలలో కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అదేవిధంగా కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు అప్రెంటిస్ చేసే సమయంలో స్టయిఫండ్ మంజూరుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల ప్రిన్సిపల్ ఎస్ ఆనందబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయాలి

● పోస్టర్స్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు విద్య జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కేరళలో ఈనెల 27 నుంచి 30 తేదీల్లో జరిగే భారతీయ విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం పోస్టర్స్ ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ఉన్న కోజికోడ్ జిల్లాలో అఖిలభారత మహాసభలు జరగనున్నట్లు తెలిపారు. విద్య కాషాయీకరణ, జాతీయ విద్యా విధానం, బీజేపీ ప్రభుత్వాలు చేసే విద్యా సంస్కరణలపై జాతీయస్థాయిలో చర్చ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు నవిత, సహాయక కార్యదర్శి రూపాస్, జిల్లా కమిటీ సభ్యులు షంషీర్, సౌమ్య, సుభాష్, గుంటూరు నగర ఉపాధ్యక్షులు జాన్, నగర కమిటీ సభ్యులు సైదాబీ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

తైక్వాండోలో లిటిల్ ఫ్లవర్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : ఐసీఎస్ఈ తైక్వాండో జోనల్ స్థాయి పోటీల్లో లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు ప్రతిభ చూపారు. నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో జోన్ బి పరిధిలోని ఐసీఎస్ఈ తైక్వాండో పోటీలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా అండర్ 14, 17, 19 విభాగాల్లో బాల బాలికలు పోటీ పడ్డారు. ఈ పోటీల్లో కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్న లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో 14 మంది లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించి అగ్ర భాగాన నిలిచారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ శవరి మాట్లాడుతూ తమ స్కూల్ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, ఎన్‌సీసీ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లోనూ పాల్గొనడమే కాకుండా ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ కాశీనాథ్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ సిస్టర్ సోఫియా, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అండర్ 14 బాలుర విభాగంలో పి సిద్ధార్థ్, బి భవిష్య, వెంకట విజయ్, పి అఖిలేష్, వి విక్రమ్ ఆద్య, అండర్ 17 బాలికల విభా గంలో బి.రేణుక చౌదరి, కె రియ ప్రభవ్, డి దర్శిత, జి శ్లోక, అదేవిధంగా అండర్ 17 బాలుర విభాగంలో జి విహాన్, కె జై రోహన్, సిహెచ్ నంద క్రిష్, వి అశ్విన్ కుమార్, బి అభిరామ్ తదితరులు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. అండర్ 14 బాలికల విభాగంలో పి.ధృతి శ్రీ, బి ప్రిన్సి, ఎన్ హర్షవర్ధని, అదేవిధంగా అండర్ 17 బాలుర విభాగంలో బి నితీష్ సంహిత్, సిహెచ్ రాహుల్, అండర్ 17 బాలికల విభాగంలో బి జోష్నేద్ ప్రియ, కె మీరా తదితరులు సిల్వర్ పతకాలు కైవసం చేసుకున్నారు. అదేవిధంగా అండర్ 17 బాలికల విభాగంలో సునందిని రామ్, గ్రేసీ జాయ్, ఎం ఆరాధ్య బ్రాంజ్ మెడల్స్ సాధించారు.

రెవెన్యూ డేకు బడ్జెట్ కేటాయింపుపై హర్షం

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీన జరగనున్న రెవెన్యూ డేకు నిధులు కేటాయించినందుకు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలిని ఏపీఆర్ఎస్ఏ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ డేను ఒక పండుగలా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. అనంతరం డీఆర్వో స్పందిస్తూ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రెవెన్యూ డేను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ డేని ఘనంగా నిర్వహించాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకట్రావు, రాష్ట్ర కార్యదర్శి దివ్య దుర్గ, విజయ్ శ్రీ, బాస్కరరావు, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి షేక్ ఆయుబ్ పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న మేకల రవీంద్రబాబు తదితరులు

చిత్రలేఖనం పోటీల్లో సెయింట్ లారెన్స్ విద్యార్థిని ప్రతిభ

గుంటూరు విద్య, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చిత్రలేఖనం పోటీల్లో ఆర్టీసీ కాలనీలోని సెయిం ట్ లారెన్స్ స్కూల్ విద్యా ర్థిని బుస్రా ఫాతిమా బహుమతి సాధించిన ట్లు కార్యదర్శి మేకల రవీంద్రబాబు మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ అనే సంస్థ పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. విద్యార్థిని పాఠశాల కార్యదర్శి రవీంద్రబాబు, ఉపాధ్యాయులు సత్కరించారు.

నకిలీ బంగారంతో రుణంపై చీటింగ్ కేసు నమోదు

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : అరండల్‌పేట పదో లైన్ లోని మిస్ ఇండెల్ మనీ లిమిటెడ్ సంస్థలో పనిచేసే ఉద్యోగి పరస సుజన్‌రాజు ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలో తాను పని చేస్తున్న సంస్థలో నాలుగు ఖాతాలు తెరిచి అందులో నకిలీ బంగారాన్ని కుదువ పెట్టి మొత్తం రూ.7లక్షల 73 వేల 316 తీసుకున్నాడు. అయితే 40 రోజుల గడువు ఇస్తే మొత్తం బకాయి చెల్లిస్తానని, పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని సుజన్ రాజు వేడుకున్నాడు. దీంతో సంస్థ సిబ్బంది ఆయనకు 40 రోజుల గడువు ఇచ్చారు. అయినప్పటికీ ఆయన ఆ మొత్తం చెల్లించకపోవడంతో మంగళవారం సంస్థ ఏరియా మేనేజర్ కే సాంబశివరావు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, చిత్రంలో డాక్టర్ శేషయ్య తదితరులు

లోకేశ్‌పై ఆరోపణలు నిరూపించకపోతే వైసీపీ మూసేయాలి!

● గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): 'ఎన్డీయే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనంను అమలు చేస్తే అది చూసి తట్టుకోలేని జగన్‌రెడ్డి అండ్ కో మంత్రి నారా లోకేశ్ మీద విషం చిమ్ముతోంది, దానిని తాము ఏ మాత్రం సహించబోము, చేసిన అసత్య ఆరోపణలు నిరాధారం అని ప్రజలకు క్షమాపణలు చెప్పాలి. ఆరోపణలు నిరూపించలేకపోతే వైసీపీ పార్టీ మూసివేయాలి' అంటూ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఎంతమంది బిడ్డలుంటే అంత మందికి 'తల్లికి వందనం' డబ్బు జమచేశామన్నారు. వైసీపీ పాలనలో కూడా రూ.13 వేలే ఇచ్చారంటే, మిగిలిన రూ2 వేలు జగన్ జేబుల్లోకి పోయాయా? తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా? అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రశ్నించారు. వైసీపీ చేసిన విమర్శలను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. జగన్ హయాంలో ప్రతియేటా వివిధ కారణాలతో లబ్ధిదారులను తగ్గించుకుంటూ పోయారని 2021లో 44.48 లక్షల మంది లబ్ధిదారులు ఉంటే, 2023కి ఆ సంఖ్య 42.61 లక్షలకు పడిపోయిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నిమ్మల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

● తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో పొన్నూరు నియోజకవర్గానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కసుకుర్తి హనుమంతరావును పార్టీ నియమించింది. ఈ సందర్భంగా హనుమంతరావు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

రౌడీలను పరామర్శించటం జగన్‌కు అలవాటుగా మారింది

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : రౌడీలను పరామర్శించడం జగన్‌కు అలవాటుగా మారిందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పల్నాడు జిల్లా రెంటపాళ్లలో వైసీపీ అరాచకవాది కొర్లకుంట నాగమల్లేశ్వర రావు ఆత్మహత్యకు వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబే ప్రధాన కారణం అని విమర్శించారు. వైసీపీ వెయ్యి శాతం గెలుస్తుందని జగన్ చెప్పాడని మల్లేశ్వరరావుతో బెట్టింగులు పెట్టించి, ఆ డబ్బంతా అంబటి స్వాహా చేయడంతో దిక్కు తోచక ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. అంబటికి మట్కా, లాటరీలు, కోతముక్క, గుండాట, చీప్ లిక్కర్ తదితర అవినీతి, అనైతిక చర్యలను ప్రోత్సాహిస్తూ దోపిడీకి పాల్పడటం అలవాటేనని కనపర్తి ఆరోపించారు. రౌడీలను, గూండాలను, వారి కుటుంబాలను పరామర్శించడం జగన్‌రెడ్డికి అలవాటుగా మారిందని అన్నారు. గతంలో బటన్ నొక్కటానికి మాత్రమే బయటకొచ్చే జగన్ ఇప్పుడు శవం దొరికితే తప్ప బయటకు రావటం లేదని ఎద్దేవా చేశారు. జగన్ లాంటి వ్యక్తి ప్రజాస్వామ్యానికి హానికరమని, ఆయన ఎత్తుగడలపై ప్రభుత్వం, ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పబ్బం గడుపుకునేందుకే పరామర్శ యాత్రలు

● ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ


మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాజకీయ పబ్బం గడుపుకునేందుకే వైసీపీ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి పరామర్శ పేరుతో యాత్రలు చేస్తూ నిత్యం రాష్ట్రంలో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నాడని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ మండిపడ్డారు. ఆ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. జగన్ ఇచ్చిన తప్పుడు సర్వే రిపోర్టులతో 2024 ఎన్నికల బెట్టింగ్ లో వైసీపీ నాయకుడు నాగమల్లేశ్వరరావు రూ.10 కోట్లు పోగొట్టుకున్నారని, అప్పుల వారి నుంచి అవమానాలు భరించలేక ఆయన 2024 జూన్ 9న ఆత్మహత్య చేసుకున్నాడని, కూటమి ప్రభుత్వం ఏర్పడకముందే వేధింపులంటూ వైసీపీ నాయకులు ప్రచారం చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. ఏడాది క్రితం వైసీపీ నాయకుడు నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడితే ఇప్పుడు విగ్రహావిష్కరణ పేరుతో ఈనెల 18న పల్నాడు జిల్లా రెంటపాళ్లలో పరామర్శ పేరుతో యాత్ర చేయడం శోచనీయమన్నారు.

తల్లికి వందనం పై బులుగు విషం

● ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్


దేగల ప్రభాకర్

గుంటూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకంపై వైసీపీ బులుగు మూకలు విషం చిమ్ముతున్నాయని ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నగర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంత మందికి తల్లికి వందనం కార్యక్రమం కింద రూ.15 వేలు ఇస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.15 వేలలో రూ.2 వేలు లోకేశ్ జేబుల్లోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే రుజువు చేయండంటూ చైర్మన్ ప్రభాకర్ సవాల్ విసిరారు. కనీసం తల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్‌రెడ్డి నేడు తల్లికి వందనం గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. వైసీపీ పాలనలో కూడా అమ్మఒడి ద్వారా రూ.13 వేలు ఇచ్చారు, అంటే రూ.2 వేలు జగన్ జేబుల్లోకి పోయాయా? తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా? అని ప్రశ్నించారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే, కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తున్నామన్నారు.

పాలస్తీనాకు అండగా నిలవాలి

గుంటూరు(తూర్పు), జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయెల్ పైశాచిక దాడులతో సర్వం కోల్పోయిన పాలస్తీనా ప్రజలకు భారత ప్రభుత్వం అండగా నిలబడాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక, పాత బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం, వామపక్షా పార్టీల ఆధ్వర్యంలో పాలస్తీనా ప్రజలకు సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇజ్రాయెల్ యుద్ధోన్మాదంతో పశ్చిమాసియా దేశాలపై వరుసగా దాడులకు పాల్పడుతుందని విమర్శించారు. పాలస్తీనాకు అండగా నిలవాలని మోదీపై ప్రజలు ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జంగాల అజయ్‌కుమార్, కెనలిసీ కాంత్, మన్నవ హరిప్రసాదు, కే.మాల్యాద్రి, వి.రాధాకృష్ణమూర్తి, అరుణ్ కుమార్, బి.ముత్యాలరావు, దండా లక్ష్మీనారాయణ, అరుణ, అంజి బాబు, ఖాజావలీ పాల్గొన్నారు.



విద్యార్థి మిత్ర కిట్లతో విద్యార్థినులు

డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పేరుతో స్టూడెంట్ కిట్టు

హర్షం వ్యక్తం చేస్తున్న విద్యా వేత్తలు, మేధావులు, ప్రజా సంఘాలు

మహానుభావులకు.. పెద్ద పీట



బొల్లాపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వివిధ పథకాలపై ఏర్పాటు చేసిన బొమ్మలకు కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు ముగింపు పలికింది. మహానుభావుల పేర్లకు పెద్ద పీట వేసింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పథకం పేరు నుంచి లోగో వరకు పారదర్శకంగా అందరికీ ఆమోద యోగ్యంగా రూపొందించటాన్ని విద్యా వేత్తలు, మేధావులు అభినందిస్తున్నారు. ఇప్పటికే మధ్యాహ్న భోజనం పథకానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచన మేరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పేరుతో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారు. విద్యార్థులకు అందించే విద్యామిత్ర కిట్టుకు మహా పండితుడు, గొప్ప విద్యా వేత్త, భారత రెండవ రాష్ట్రపతి, ఉపాధ్యాయుల ఆరాధ్య దైవం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్రగా నామకరణం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న స్కూల్ బ్యాగ్‌లు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిపనరీలు, సమ దుస్తులు, బూట్లు, బెల్టులు ఇలా అన్నింటిపై సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పేరు, ప్రభుత్వ లోగో తప్ప మరియే ఇతర బొమ్మలు లేకుండా చేశారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యార్థులకు బ్యా గ్‌లు, పుస్తకాలు, యూనిఫాం, పంపిణీ చేసి విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకున్నారు.

పంటల సాగులో.. విత్తన ఎంపికే కీలకం



సత్తెనపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. పంటల దిగుబడుల్లో అత్యంత కీలకం మేలైన విత్తన ఎంపిక. సరైన విత్తనాన్ని ఎంచుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చు. నకిలీ, నాసిరక విత్తనాల ఎంపికతో చివరికి నష్టాలే మూట గట్టుకోవాల్సిన వస్తుంది. దీంతో ముందు నుంచే విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకించి పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉండాలంటే ఎరువులు, పురుగు మందులతో పాటు విత్తనాల కొనుగోళ్లలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గతంలో అనేక సందర్భాల్లో రైతులు నకిలీ, నాసిరకం విత్తనాలు సాగు చేసి నష్టాలను చవి చూశారు. నకిలీ కంపెనీల విత్తనాలపై విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు ఏటా తనిఖీలు చేస్తున్నప్పటికీ మార్కెట్‌లో వాటి జోరు తగ్గడం లేదు.

నిషేధిత విత్తనాలకు దూరంగా ఉండాలి

పత్తి బీటీ - 3 రకం విత్తనాలు నిషేధించారు. వీటిని సాగు కూడా చేయకూడదు. పర్యావరణానికి పెను ముప్పుగా భావించి, ఈ రకం విత్తనాల సాగుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అయినా కొంత మంది వ్యాపారులు గ్రామాల్లో గుట్టుగా బీటీ-3 పత్తి విత్తనాలను విక్రయిస్తున్నారు. అధిక దిగుబడులు వస్తాయన్న ఆశతో రైతులు అక్కడక్కడా రహస్యంగా ఈ విత్తనాలను సాగు చేస్తున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి : సుబ్బారెడ్డి, ఏవో, సత్తెనపల్లి

ఖరీఫ్ సీజన్‌కు విత్తనాల కొనుగోలులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలను కొనుగోలు చేయాలి. కొనుగోలు రసీదును తప్పనిసరిగా తీసుకుని, విత్తన నమూనా, ప్యాకెట్‌లను భద్రపరుచుకోవాలి. నాసిరకం, నకిలీ కంపెనీల విత్తనాలు అమ్మే వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి. అలాంటి వారిని గుర్తించి వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలి. విత్తన ప్యాకెట్‌పై తయారీ తేదీ, పరీక్షించిన, గడువు తేదీలు సరిగా ఉన్నాయో చూసుకోవాలి. విత్తన సంచులు చినిగినా, రంధ్రాలు ఉన్నా తడిచినా కొనుగోలు చేయక పోవడం మంచిది. విత్తన ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమ శాతాన్ని కూడా చూసుకోవాలి.

అక్రమార్కుల వలలో చిక్కుకోవద్దు

గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు విక్రయించే వారి వద్ద రైతులు కొనుగోలు చేయకూడదు. నకిలీ కంపెనీల విత్తనాలను బ్రాండెడ్ అంటూ ఆకర్షణీయ ప్యాకింగ్‌తో విక్రయిస్తుంటారు. ఆయా గ్రామాల్లోని పెద్ద మనుషులతో సంప్రదించి.. రైతులందరూ విత్తనాలు కొనుగోలు చేసేలా ఒత్తిళ్ల తెస్తుంటారు. తక్కువ ధరకే అంటూ కొందరు లూజుగా విత్తనాలు అమ్ముతుంటారు.. ఇలాంటి వ్యక్తుల గురించి వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.

బడి బ్యాగు...

బరువు తగ్గింది

❖ సెమిస్టర్ విధానంలో పాఠ్య పుస్తకాల ముద్రణ
❖ 1, 2 తరగతులకు ఒక పాఠ్య పుస్తకం, ఒకవర్క్ బుక్
❖ 3, 4, 5 క్లాసులకు తెలుగు, ఆంగ్లం కలిపి ఒక పుస్తకం

సత్తెనపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ బ్యాగ్‌లో ప్రతి సబ్జెక్ట్‌కు ఒక పాఠ్య పుస్తకం తీసుకెళ్లే రోజులు పోయాయి. ప్రభుత్వం సెమిస్టర్ విధానం తీసుకు వచ్చి ంది. తెలుగు, హిందీ, ఆంగ్లం కలిపి ఒక పాఠ్య పుస్తకంగా చేయడం, ఒకటి నుంచి 9వ తరగతి వరకు రెండు మూడు సబ్జెక్టులు కలిపి ఒక పాఠ్య పుస్తకం తీసుకురావడంతో విద్యార్థుల బ్యాగ్ కొంత బరువు తగ్గింది. దీంతో విద్యార్థులు హాయిగా పాఠశాలకు వెళ్లగలుగుతారు. ఉదాహరణకు మూడు నుంచి ఐదు తరగతులకు తెలుగు, ఇంగ్లీష కలిపి ఒక టెస్ట్ బుక్, గణితం, ఈవీఎస్ కలిపి ఒక టెస్ట్ బుక్, ఒక వర్క్ బుక్, కేవలం మూడు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ తీసుకు వెళితే సరిపోతుంది.

పాఠ్య పుస్తకాలు వివరాలు ఇలా...

ఒకటి, రెండు తరగతులకు సంబంధించి ఒక సెమిస్టర్‌కు తెలుగు, లెక్కలు, ఇంగ్లీష కలిపి ఒక పాఠ్య పుస్తకం, ఒక వర్క్ బుక్ ఇచ్చారు. 3, 4, 5 తరగతులకు తెలుగు, ఇంగ్లీష కలిపి ఒక పాఠ్య పుస్తకం, లెక్కలు, ఈవీఎస్ కలిపి ఒక పాఠ్య పుస్తకంగా చేశారు. దీంతో పాటు వర్క్ బుక్ ఇచ్చారు. 6, 7 తరగతుల్లో తెలుగు, హిందీ, ఇంగ్లీష కలిపి ఒక పాఠ్య పుస్తకం చేశారు. లెక్కలు, సైన్స్, సోషల్ పాఠ్య పుస్తకాలు విడివిడిగా ఇచ్చారు. 8, 9 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష కలిపి ఒక పాఠ్య పుస్తకం, భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం కలిపి ఒకటి, లెక్కలు ఒక పాఠ్య పుస్తకం, సోషల్, సైన్స్ ఒక పాఠ్య పుస్తకంగా ఇచ్చారు. 9వ తరగతికి అదనంగా ఆంగ్ల పదాలు, వ్యక్తీకరణకు సంబంధించి ఒక వర్క్ బుక్ ఇచ్చారు. 10వ తరగతిలో తెలుగు, హిందీ, ఇంగ్లీష, భౌతిక శాస్త్రం, లెక్కలు జీవ శాస్త్రం, సోషల్ సైన్స్‌లో చరిత్ర, భూగోళ రాజకీయ ఆర్థిక శాస్త్రం పాఠ్య పుస్తకాలు విడిగా ఇచ్చారు.



పాఠ్య పుస్తకాలతో విద్యార్థులు

తల్లికి వందనం..

ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభం

● ఎక్కువగా సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ అనర్హత అర్జీలే
● హౌస్‌హోల్డ్ నుంచి విభజించాలని విజ్ఞప్తులు
● తమకు ఆ అవకాశం లేదంటున్న సచివాలయాల ఉద్యోగులు

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకానికి సంబంధించి ఫిర్యాదుల స్వీకరణ గ్రామ/వార్డు సచివాలయాల్లో సిబ్బంది ప్రారంభించారు. ఇప్పటికే సచివాలయాల వారీగా ఈ పథకానికి అర్హులు, అనర్హుల జాబితాలను ప్రచురించారు. అలానే వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. ఈ జాబితాల్లో లేని విద్యార్థుల తల్లులు స్కూల్ ఐడీ, పాఠశాలలో గత రెండేళ్ల పిల్లల హాజరు శాతం, తల్లి, బిడ్డ ఆధార్‌లు, రైస్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, ఫోన్ నంబర్లను తీసుకొని సచివాలయాలకు వస్తే ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి అర్జీలు పంపిస్తామని సిబ్బంది చెబుతున్నారు. దీంతో అర్హత ఉండి ఎవరికైతే తల్లికి వందనం నగదు జమ కాలేదో ఆ తల్లులు సచివాలయాలకు వెళ్లి అర్జీలు దాఖలు చేస్తున్నారు.

అర్హులై ఉండి..నగదు జమకాకుంటే..

ఒక కుటుంబంలో ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులు ఎంతమంది ఉంటే అంతమందికీ తల్లికి వందనం పథకం కింద రూ.13 వేల చొప్పున నగదుని నేరుగా తల్లుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. ఈ పథకం కింద గుంటూరు జిల్లాలో 2,01,911, బాపట్లలో 1,45,009, పల్నాడులో 2,47,393 మంది విద్యార్థులకు రూ.13 వేల వంతున వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసింది. అర్హుల జాబితాలో ఉండి నగదు జమ కాకపోతే బ్యాంకులకు వెళ్లి ఎన్‌పీసీఐకి లింకు చేసుకోవాల్సిందిగా సూచించింది. ప్రభుత్వం నగదు మొత్తాన్ని ఎన్‌పీసీఐకి డిపాజిట్ చేయగా ఆ సంస్థ రోజుకు కొన్ని లక్షల మందికి నగదుని జమ చేస్తోంది. చాలా మందికి మంగళవారం కూడా బ్యాంకు ఖాతాల్లో నగదు డిపాజిట్ అయింది.

ఆ ఆప్షన్ సచివాలయ ఉద్యోగులకు లేదు

హౌస్‌హోల్డ్ డేటాలో లోగడ ఉమ్మడి కుటుంబాలు ఉన్నాయి. తల్లి, తండ్రి, పిల్లల్లో ఏ ఒక్కరు సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్‌లో అనర్హులైనా.. ఆ కుటుంబంలో అర్హులున్నా తల్లికి వందనం నగదు జమ కావడం లేదు. దాంతో హౌస్‌హోల్డ్ డేటాలో తమ కుటుంబం వరకు విభజించాలని చాలామంది అర్జీలు ఇస్తున్నారు. అయితే దీనికి సంబంధించిన ఆప్షన్ సచివాలయాల సిబ్బందికి ఇవ్వలేదు. ప్రస్తుతం హౌస్‌హోల్డ్ డేటాలోకి కేవలం చేర్పులు చేసే అవకాశం మాత్రమే కల్పించారు. తొలగింపులు అవకాశం ఇచ్చినప్పుడు చెబుతామని, అప్పుడు రావాల్సిందిగా చెప్పి పంపేస్తున్నారు.

అనర్హుల సమస్యలకు పరిష్కారాలు..

- సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ డేటా గతేడాదే ప్రామాణికంగా తీసుకోవడం వల్ల కొంతమందిని అర్హత ఉన్నప్పటికీ అనర్హుల జాబితాలో చేర్చారు. విద్యుత్ నెలకు సగటు వాడకం 300 యూనిట్ల లోపు ఉంటే.. తల్లి ఆధార్, రైస్‌కార్డు, ఫోన్ నంబరు, ఏపీ సీ పీడీసీఎల్ డీఈఈ నుంచి ఒక సంవత్సరం విద్యుత్ బిల్లు సగటు 300 యూనిట్ల కంటే తక్కువ ఉన్నట్లు ఆకుపచ్చ ఇంకు పెన్నుతో సంతకం చేయించి, స్టాంప్ ముద్ర వేయించి అందజేయాలి.
- ఆదాయపు పన్ను చెల్లిస్తున్నట్లుగా తప్పుగా చూపిస్తే ఆధార్ నంబరు, రైస్‌కార్డు, చార్టెర్డ్ అకౌంటెంట్ నుంచి ఫాం-26 ఏఎస్ పత్రాలను నివేదించాలి.
- రైస్‌కార్డు ఉన్నా లేనట్లు అనర్హుల జాబితాలో ఉంటే ఆధార్, రైస్‌కార్డు, ఫోన్ నంబరు ఇవ్వాలి.
- నాలుగు చక్రాల సొంత వాహనం లేకపోయినా ఉన్నట్లు ఉంటే.. రవాణ శాఖకు వెళ్లి సర్టిఫికెట్ తెచ్చుకోవాలి.
- గ్రామీణ/పట్టణ ప్రాంతాల్లో అనుమతికి లోబడే స్థలాలు ఉన్నప్పటికీ.. అనర్హుల జాబితాలో ఉంటే నేరుగా సచివాలయాల్లోనే సంబంధిత పత్రాలతో ఫిర్యాదు చేయాలి.
- ప్రభుత్వ ఉద్యోగులైతే తల్లికి వందనం పథకానికి అనర్హులు.



మల్కాపురం గ్రామ సభ రసాభాస

● ఆలయ నిర్మాణంపై వాదోపవాదనలు

తుళ్లూరు, (మాల్కాపురం), జూన్ 17,(ఆంధ్రజ్యోతి) : ఆలయ నిర్మాణ విషయంలో ప్రజాభిప్రాయం కోసం మల్కాపురం పంచాయతీ కార్యాలయంలో మంగళ ఏర్పాటు చేసిన గ్రామ సభ రసాభాసగా మారింది. గత నెల 31న హైద్రాబాద్‌కు చెందిన భవాని అనే మహిళ మల్కాపురం సుగాలి కాలనీలో ఉన్న రాణిరుద్రమ్మ దేవి నాటి శిలాశాసనం, సుబ్రమణ్యస్వామి ఆలయ ఉన్న చారిత్రాత్మక ప్రదేశంలో శివాలయం నిర్మించడానికి శంకుస్థాన చేశారు. దీనిపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సుగాలి కాలనీ వాసులను ఖాళీ చేయించి.. గుప్త నిధులు కైవసం చేసుకోవాలనే ఆలోచనతోనే.. గ్రామస్తులకు తెలపకుండా శంకుస్థాపన చేశారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయం కోసం కార్యదర్శి సాంబశివరావు గ్రామ సభను ఏర్పాటు చేయగా.. గ్రామస్తులకు వాదోపవాదాలు జరిగి గందరగోళం నెలకొంది. తమకు పట్టాలున్నాయని, ఆలయం నిర్మాణం అంటూ ప్రతిసారి ఖాళీ చేయాలని తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సుగాలి కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. చారిత్రాత్మక ప్రదేశంలో ఆలయ నిర్మాణం చేయడానికి అభ్యంతరం లేదని, అయితే ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎండోమెంటు, పురావస్తు శాఖ అనుమతులతో చేపట్టాలని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఇందుకు గ్రామస్తులతో కమిటీ వేయాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ ప్రదేశాన్ని సీఎం చంద్రబాబు నాయుడు సందర్శించి, రాణి రుద్రమ్మ దేవీ శిలా శాసనం వద్ద ఆమె జయంతి సందర్భంగా కొబ్బరికాయ కొట్టారని గుర్తుచేశారు. దీనిని ఒక చారిత్రాత్మక ప్రదేశంగా తీర్చి దిద్దాలని, కాలనీ వాసులకు మెరుగైన సౌకర్యాలతో నివాసాల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులకు చంద్రబాబు సూచించారని చెప్పారు. తాను బాబా వారి భక్తురాలినని... కలలో ఆయన ఆలయ నిర్మాణం చేయాలని సూచించినట్టు భవానీ గ్రామ సభలో తెలిపింది. తనకు ఎటువంటి దురుద్దేశం లేదని చెప్పింది. రూ.50 లక్షల వరకు ఆలయ నిర్మాణానికి ఖర్చు చేస్తానని హామీ ఇచ్చారు. స్పెషలాఫీసర్ రేష్మా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



గ్రామ సభలో వాదులాడుకుంటున్న గ్రామస్తులు

మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు స్వల్ప అస్వస్థత

● జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ జిల్లా జైల్లో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. తనకు కడుపు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని జైలు అధికారులకు నందిగం ఫిర్యాదు చేశారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు జైలులో డాక్టర్ లక్ష్మీప్రియ మాజీ ఎంపీని పరీక్షించారు. ఆమె ఎటువంటి ఇబ్బందికర పరిస్థితిని గుర్తించలేదు. అయినప్పటికీ నిందితుడు సురేష్ తనకు కడుపు నొప్పిగా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని చెప్పడంతో వైద్య పరీక్షల నిమిత్తం మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో నందిగంను జిల్లా జైలు నుంచి జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఈసీజీ చేసి నార్మల్‌గా ఉందని తెలిపారు. రాత్రి సురేష్‌కు కార్డియాలజిస్ట్ పర్యవేక్షణలో ఎకో పరీక్షలు చేస్తున్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ స్పందిస్తూ.. మాజీ ఎంపీ సురేష్ ఆరోగ్యం పూర్తి నిలకడగా ఉందని తెలిపారు. విషయం తెలియగానే నందిగం సతీమణితో పాటు పలువురు వైసీపీ కార్యకర్తలు హాస్పిటల్‌కు చేరుకున్నారు. స్వగ్రామం ఉద్దండ్రా యునిపా లెంలో టీడీపీ కార్యకర్త ఇసుకపల్లి రాజుపై హత్యాయత్నం కేసులో.. గత నెల 19 నుంచి నందిగం గుంటూరు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు.



నందిగం సురేష్‌ను వైద్య పరీక్షలకు తీసుకువెళుతున్న పోలీసులు

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

గుంటూరు/సత్తెనపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి మునిసిపాలిటీకి చెందిన 17, 18, 21, 22 వార్డుల వైసీపీ కౌన్సిలర్లు సెగ్గెం పద్మావతి, తోట వెంకట సుధారాణి, కాకుమాను రవికుమార్, శెట్టి ఆనంద్‌కుమార్ మంగళవారం టీడీపీలో చేరారు. గుంటూరులోని కన్నావారి తోటలో ఉన్న క్యాంపు కార్యాలయంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్ళలో బుధవారం పర్యటించనున్న నేపథ్యంలో నలుగురు కౌన్సి లర్లు టీడీపీలో చేరి ఆ పార్టీకి జలక్ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఉన్నారు.



గుంటూరులో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

జగన్ తీరుపై కేడర్‌లో అసహనం

సత్తెనపల్లి, నరసరావుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్ పరామర్శల పర్యటనలపై ఆ పార్టీ కేడర్ లోనే అసహనం నెలకొంది. ఇప్పటికే తెనాలిలో రౌడీషీటర్ల కుటుం బసభ్యుల పరామర్శపై ఆ పార్టీ కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం రాకముందు ఎన్నిక ల్లో బెట్టింగ్‌లకు పాల్పడి ఆత్మహత్య చేసుకున్న సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల మాజీ ఉపసర్పంచ్ నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను ఏడాది తర్వాత పరామర్శించేందుకు జగన్ రానుండ టంపైనా ఆ పార్టీ కేడర్‌తో పాటు సామాన్య ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. రెంటపాళ్లలో కార్యక్రమం జరిగే ప్రాంతం ఇరుకుగా ఉంటుంది ఎక్కువ మంది వస్తే ప్రమాదం.. వంద మంది, మూడు వాహనాలతో రావొచ్చని పోలీసు అధికారులు సూచిస్తున్నా భారీగా జనసమీకరణకు వైసీపీ నేతలు సిద్ధమవుతుండటంపైనా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తెనాలి పరామర్శలపై ప్రజల నుంచి వస్తున్న విమర్శలకు సమా ధానాలు చెప్పుకోలేక పోతున్న క్రమంలో రెంటపాళ్లకు జగన్ రాకపై వైసీపీ కార్యకర్తల్లోనూ అసంతృప్తి నెలకొంది. ఇక నాగమల్లేశ్వరరావు గత ఎన్నికల్లో జగన్‌దే అధికారమని రూ.4 కోట్లు బెట్టింగ్‌లు కాసి.. 2024 జూన్ 4 కౌంటింగ్ రోజునే ఊరు వదిలి పారిపోయి.. 5న మేడికొండూరు సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి గుంటూరులో చికిత్స పొందుతూ 9న మృతి చెందాడు. ఈ మేరకు అదే నెల 10న పోలీసులు కూ డా కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో అతడి ఆత్మహత్యకు కూటమి ప్రభుత్వానికి సంబంధం ఏమిటని, కూటమి ప్రభుత్వం రాక ముందు ఘటన జరగ్గా.. ఇప్పుడు జగన్ పరామర్శకు రావడంలో ఏమైనా అర్థం ఉందాని సామాన్య ప్రజలతో పాటు, వైసీపీ క్యాడర్ కూడా ప్రశ్నిస్తోంది. నాగమల్లేశ్వరరావు మృతి సమయంలోనే ఆ పార్టీ నేతలు, స్థానిక ఎమ్మెల్యే అంబటి రాం బాబు ఎందుకు పరామర్శించలేదని కూడా గ్రామస్తులతో పాటు ఆ పార్టీ నాయకులు కూడా ప్రశ్నిస్తున్నారు. సంవత్సరం తర్వాత జగన్ నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యపై హడావుడి చేయడంలో కుట్రకోణంపైనా కూడా ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నా రు. ప్రకాశం జిల్లా పొదిలిలో ఇటీవల శాంతిభద్రతల సమస్య నెలకొన్న నేపథ్యంలో రెంటపాళ్ల పర్యటనకు ఆంక్షలతో పోలీసులు అనుమతించినా జగన్ పర్యటనను అడ్డుకునేందుకు కూటమి ప్ర భుత్వం కుట్రలు చేస్తోందని ఆ పార్టీ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు ఆరోపించడంపైనా కేడర్ ముక్కున వేలేసుకుంటోంది.

అరాచకాలను ప్రోత్సహించడానికే పర్యటన : కన్నా

అరాచకశక్తులకు ప్రోత్సహించడానికే జగన్ పర్యటనలు చేస్తు న్నారని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. నాగమల్లేశ్వరరావు మృతికి వైసీపీ నేత జగనే కారణమని ఆరోపించారు. ఎన్నికల్లో వైసీపీ గెలుస్తుందని బెట్టింగ్‌లు కట్టి నష్టపోయి ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.

ఎరువుల నిల్వలు.. పుష్కలమేనా..!

(5వ పేజీ తరువాయి)

దళారులు సొమ్ము చేసుకోవడం గత ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగింది. ముఖ్యంగా డీఏపీ విషయంలో ఈ తంతు పెద్ద ఎత్తున నడిచేది. ఎంఆర్‌పీ కన్నా దాదాపు రూ.50లు అదనంగా వసూలు చేసి అన్నదాతలను నిలువునా వంచించారు. ప్రస్తుతం ఎట్టి పరిస్థితుల్లోనూ ఎరువుల కొరత రానివ్వకూడదనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది. కానీ అందుకు తగినట్లుగా సంబంధిత వ్యవస్థలు సిద్ధంగా ఉన్నాయా లేదా అనేదే ఇక్కడ తలెత్తుతున్న ప్రశ్నగా ఉంది. ఖరీఫ్ పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఇందుకు తగినట్లుగా మార్క్‌ఫెడ్ నిత్యం ఎరువుల లభ్యతపై దృష్టిపెట్టాల్సి ఉంది. రైతు సేవా కేంద్రాలతో పాటు సొసైటీలలో ఉన్న నిల్వలపై వారాంతపు సమీక్షలు నిర్వహించి డిమాండ్‌కు అనుగుణంగా నిల్వలు పెంచుకునే కసరత్తు క్రమం తప్పకుండా చేయాల్సి ఉంది. సమాంతరంగా బయటి మార్కెట్‌లో ఉన్న ఎరువుల నిల్వల సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై సంబంధిత వ్యవస్థలు కొరడా ఝుళిపిస్తేనే ఎరువుల పంపిణీ సజావుగా జరిగి అన్నదాతకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.

లైసెన్సులు రద్దు చేస్తాం

ఎరువుల క్రయవిక్రయాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే లైసెన్సులు రద్దు చేయడానికి కూడా వెనకాడబోమని తాజాగా ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. వ్యాపారులు ఎరువుల అమ్మకాల్లో కచ్చితంగా ఈ-పోస్ ద్వారా రియల్ టైం స్టాక్ రసీదు విధానం పాటించాలనే ఆదేశాలను ప్రభుత్వం జారీ చేసింది. దీని ద్వారా ఎరువుల నిల్వలు ఎంతమేర ఉన్నాయనే సమాచారం తెలుసుకోవడం వ్యవస్థలకు తేలికవుతుందనేది ప్రభుత్వం ఆలోచనగా ఉంది. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులు పర్యవేక్షించాలని కూడా ప్రభుత్వం తెలిపింది. కానీ సీజన్ ఆరంభంలో ఇలాంటి హడావిడి మామూలే అన్న ధోరణిలో వ్యాపారుల వైఖరి ఉంటుంది. గడచిన మూడేళ్లలో ఎరువుల అమ్మకాల్లో అక్రమాలకు సంబంధించి ఎన్ని షాపుల మీద చర్యలు తీసుకున్నారనేదానికి ఆయా విభాగాల వద్ద సమాధానమే కొరవడింది.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 195 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,160, గరిష్ఠధర రూ.9,950, మోడల్‌ధర రూ.9,275 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,150, గరిష్ఠధర రూ.9,950, మోడల్‌ధర రూ.9,275 పలికాయి.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి

ఫిరంగిపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ఫిరంగిపురం సమీపంలోని మెరికపూడి గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృత్యువాతపడ్డారు. వేగంగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కృష్ణా జిల్లా కోడూరు మండలం నారేపాలెం గ్రామానికి చెందిన క్రాంతికుమార్ తన సమీప బంధువు సుదర్శన్‌తో కలసి ద్విచక్ర వాహనం కొనుగోలు చేసేందుకు మెకానిక్ గుమ్మడి దుర్గాప్రసాదును తీసుకొని చిత్తూరు జిల్లా పీలేరుకు వెళ్లారు. కొనుగోలు చేసిన బైక్‌పై ముగ్గురూ వస్తుండగా.. గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సుదర్శన్ (21) అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిని మిగిలిన ఇద్దరిని 108 అంబులెన్స్‌లో నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మెకానిక్ దుర్గాప్రసాద్ మృతి చెందాడు. క్రాంతికుమార్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఫిరంగిపురం సీఐ కె.రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డాబా మీద నుంచి పడి వ్యక్తి మృతి

తుళ్లూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి) డాబా మీద నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. మండల పరిధిలోని అనంతవరం గ్రామంలో సోమవారం రాత్రి చాగంటి చంద్రమౌళి తన డాబా మీద పడుకోవటానికి వెళ్లాడు. చుట్టూ పిట్టగోడ లేకపోవడంతో ప్రమాదవ శాత్తు పైనుంచి కింద సిమెంటు రోడ్డు మీద పడ్డాడు. గమనించిన భార్య, బంధువులు హుటాహుటిన గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. తలకు బలమైన గాయమైంది. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తుళ్లూరు ఎస్‌ఐ కలగయ్య తెలిపారు.

నీటి గుంతలో పడి..

తుళ్లూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి) నీటి గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజధాని పనులు చేపట్టిన ఓ సంస్థలో పని చేస్తున్న వ్యక్తి ఎన్- 9 రోడ్డు ఈ-7 రోడ్డు జంక్షన్ వద్ద గల నీటి గుంతలో పడి మృతి చెందాడు. బైకుపై వెళుతున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంగళగిరి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

గేదెను ఢీకొన్న ద్విచక్రవాహనం..

● వ్యక్తి మృతి

కాకుమాను, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గేదెను ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలపరిధిలోని అప్పాపురంలో సోమవారం రాత్రి జరిగింది. కాకుమాను పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెదనందిపాడు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన డీ సాంబశివరావు అనే వ్యక్తి పనుల నిమిత్తం అప్పాపురం వచ్చి ద్విచక్ర వాహనంపై తిరిగి వెళుతున్న సమయంలో అప్పాపురం శివారు మురుగుకాలువ వద్ద రాత్రి సమయంలో గేదె అడ్డురావడంతో తన ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది దీంతో సంఘటనా స్థలంలోనే పడిపోయాడు. స్థానికులు 108 సహాయంతో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కాకుమాను పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

మంగళగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంటీఎంసీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. యూనియన్ నేత చెంగయ్య మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పారిశుధ్య కార్మికులకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. తల్లికి వందనం పథకాన్ని పారిశుధ్య కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు కే.వెంకటేశ్వరమ్మ, నేతలు వై శివనాగేశ్వరరావు, ఎం నాగార్జున తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

బస్సును ఢీకొన్న లారీ

దుగ్గిరాల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తెనాలి -విజయవాడ మెయిన్‌రోడ్‌లో తుమ్మపూడి సమీపంలో ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. అదృష్టవశాత్తూ ప్రయాణికులెవ్వరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. లారీ ఢీకొన్న వేగానికి బస్సు ముందుబాగం బాగా దెబ్బతింది. ఆర్టీసీ బస్‌డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరవి తెలిపారు.

క్రాఫ్ట్ టీచర్‌ను నియమించరూ

దుగ్గిరాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో క్రాఫ్ట్‌టీచర్‌ను నియమించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. 1962లో స్థాపించిన బాలికోన్నత పాఠశాలలో పదేళ్ల క్రితం వరకూ ఉన్న క్రాఫ్ట్ టీచర్‌పోస్టును నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం 405 మంది విద్యార్థినులు పాఠశాలలో చదువుకుంటున్నందున బాలికలకు చేతిపనులు నేర్పించడం ద్వారా నైపుణ్యతను పెంచుకునే అవకాశం కలుగుతుందన్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డు

● పగిలి పోయిన నాడెప్‌లు, ఫ్లోరింగ్
● అలసత్వం వహిస్తున్న అధికారులు



తిక్కిరెడ్డిపాలెంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు



షెడ్డులో పగిలి పోయి ఉన్న నాడెప్‌లు

ప్రత్తిపాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పారిశుధ్యంపై ఎక్కువ దృష్టి పెట్టడంతో పాటు స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా అడుగులు వేస్తుంటే.. కొన్ని గ్రామాల్లో అధికారుల అలసత్వం స్పష్టంగా కనిపిస్తుంది. ఇంటింటి చెత్త సేకరణతో పాటు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు నిర్వహణ పక్కాగా ఉండేం



షెడ్డు పక్కన కుప్ప వేస్తున్న చెత్త

దుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్తిపాడు మండలంలో ఇప్పటికే తుమ్మలపాలెం షెడ్డు శిక్షణ కేంద్రంగా కూడా మారింది. అలాంటిది తిక్కిరెడ్డిపాలెంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు ఎందుకూ ఉపయోగపడకుండా ఉంది. షెడ్డుల నిర్వహణపై సంవత్సర కాలంగా ప్రత్యేక దృష్టి పెట్టారు. అయితే ఇక్కడ మాత్రం ఆ ఛాయలు కనిపించడం లేదు. షెడ్డు పై భాగం బాగున్నప్పటికీ లోపలి భాగం మొత్తం ఎందుకు పనికిరాకుండా ఉంది. గతంలో నాశిరకం పనులు చేయడమో.. మరే కారణమో కానీ ఫ్లోర్ మొత్తం పగిలిపోయి గుంతలు పడి ఉంది. ఎరువులు తయారు చేసేందుకు ఉపయోగించే తొట్లు మొత్తం గంతలు పడి ఎందుకూ పనికి రాకుండా ఉన్నాయి. మండల పరిషత్ అధికారులు దీనిని గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. డివిజన్ స్థాయి పంచాయతీ అధికారులు అప్పుడప్పుడూ వచ్చి వెలుతున్నా ఏ మాత్రం ఉపయోగం లేకుండా ఉన్నాయి. గ్రామంలో ఎప్పుడన్నా చెత్త సేకరణ చేసినా ఆ మొత్తం డంపింగ్ యర్డు పక్కనే కుప్ప వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విషయంలో తిక్కిరెడ్డిపాలెం పంచాయతీ అధికారులు మాత్రం రిపేర్లకు పెట్టామని చెపుతున్నారు.

శరవేగంగా షాదీఖానా నిర్మాణ పనులు

● రూ.78లక్షల వ్యయంతో సకల హంగులు
● తీరనున్న ముస్లిం మైనార్టీల దశాబ్దాల కల
● హామీ నెరవేర్చిన మంత్రి నారా లోకేశ్



నులకపేటలో జరుగుతున్న షాదీఖానా పనులు

తాడేపల్లి టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ విద్య శాఖా మంత్రి నారా లోకేశ్ చొరవతో ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి నులకపేటలో పేద ముస్లింల దశాబ్దాల కల త్వరలోనే నెరవేరనుంది. వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకునేందుకు సకల హంగులతో సుమారు రూ.78లక్షలతో చేపట్టిన షాదీఖానా నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పేద ముస్లింలు నులకపేటలో షాదీఖానా లేకపోవడంతో వివాహాది శుభకార్యాలకు ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విన్నవించగా సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. మంత్రి లోకేశ్ చొరవతో వీపీఆర్ ఫౌండేషన్ సహకారంతో సుమారు రూ.78లక్షల వ్యయంతో సకల హంగులతో నులకపేటలోని ఈద్గా సమీపంలో సుమారు 4 వేల చదరపు అడుగుల్లో షాదీఖానా నిర్మాణం చేపడుతున్నారు. ఈ నెల చివరినాటికి నిర్మాణపనులు పూర్తి చేసి మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నారు. ఏళ్లనాటి షాదీఖానా నిర్మాణ కల నెరవేర్చిన మంత్రి నారా లోకేశ్‌కు ముస్లిం మైనార్టిలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ప్రపంచ శాంతి కోరుతూ వామపక్షాల నిరసన



మంగళగిరి అంబేడ్కర్ సెంటర్లో నిరసన తెలియజేస్తున్న వామపక్ష నేతలు

మంగళగిరి సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గాజా, పాలస్తీనాపై అమెరికా మద్దతు ఇజ్రాయెల్ బాంబు దాడులు చేయడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేడ్కర్ సెంటరులో నిరసన తెలియజేశారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఇజ్రాయెల్ అమెరికా అండతో గాజా, పాలస్తీనాపై బాంబు దాడులు చేసి పసిపిల్లలను కూడా చంపుతుందని విమర్శించారు. అంతర్జాతీయ నిబంధనలను కూడా ఉల్లంఘిస్తూ ప్రజల ప్రాణాలను తీస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు వీసం జవహర్‌లాల్, చెంగయ్య, రాఘవులు, పీ బాలకృష్ణ, సీపీఐ నేతలు అన్నవరపు ప్రభాకర్‌రావు, పీ.నాగేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, సీపీఐ ఎంఎల్ నేత కూరపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లి / తాడేపల్లి టౌన్, (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం, పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రాతూరు రోడ్డు జాతీయ రహదారి వద్ద పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన నిరసనలో సీపీ ఎం సీనియర్ నేత జొన్నా శివశంకర్ మాట్లాడూతూ తమ ఆధిపత్యాన్ని చూపించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్‌కు సహకరిస్తున్నారని విమర్శించారు. ప్రజలు శాంతిని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వామపక్ష నేతలు జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఉండవల్లి కూడలిలో సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం రవి ఆధ్వర్యంలో, పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్లో జరిగిన నిరసనలో యుద్ధం వద్దు - ప్రపంచ శాంతి ముద్దు అంటూ నినాదాలు చేశారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి

తాడికొండ జూన్ 17(ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమాన్ని వెంటనే ఆపాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు డిమాండ్ చేశారు. తాడికొండ బస్టాండ్‌లో మంగళవారం సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భద్రయ్య, జోజి, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

● పెదనందిపాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ఇజ్రాయెల్ మారణహోమానికి వ్యతిరేకంగా నిరసన ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు, జంపని రామారావు, కన్నెగంటి చంద్రరావు, ముద్దన వెంకటేశ్వర్లు, షేక్ షమీ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కృష్ణలంక జాతీయ రహదారిపై బైక్‌తో యువకుల విన్యాసాలు

● ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో వైరల్ ● ఇద్దరిపై కేసు నమోదు చేసిన కృష్ణలంక పోలీసులు

వన్‌టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెనుమాక ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు వారి బైక్‌పై విజయవాడ కృష్ణలంక జాతీయ రహదారి మీద ప్రాణాంతకమైన విన్యాసాలు చేశారు. ప్రచారం కోసం వారి ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ వీడియోను అప్‌లోడ్ చేయటంతో వైరల్ అయ్యింది. దీనిపై విమర్శలు రావటంతో పోలీసు అధికారులు స్పందించి వారి వివరాలు తెలుసుకుని ఇద్దరిపై కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనుమాక ప్రాంతానికి చెందిన సురేష్ అదే ప్రాంతానికి చెందిన తన స్నేహితుడి బైక్ తీసుకున్నాడు. సురేష్ మరో స్నేహితుడుతో కలిసి విజయవాడ కృష్ణలంక అంబేడ్కర్ పార్క్ వద్ద జాతీయ రహదారిపై వివిధ విన్యాసాలు చేసి వీడియో చిత్రీకరించుకున్నారు. అంతటితో ఆగకుండా ప్రచారం కోసం ఆ వీడియోను వారి ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ వీడియోలు మూడు రోజుల నుంచి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారులు విన్యాసాల వీడియోపై ప్రత్యేక దృష్టి సారించి ఎట్టకేలకు వారిని గుర్తించారు. కృష్ణలంక పోలీసులు బైక్ యజమానిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఈ విచారణలో సుమారు ఆరు నెలల క్రితం స్నేహితుడు సురేష్ అలియాస్ హంగామా అవసరం ఉందని, గంటలో వస్తానని తన బైక్ తీసుకుని వెళ్లాడని, ఆ తరువాత కృష్ణలంక జాతీయరహదారి మీద వివిధ రకాల విన్యాసాలు చేసి వారి ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టుకున్నట్టు బైక్ యజమాని పోలీసులకు తెలిపాడు. దీంతో పోలీసులు అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు సురేష్, అతని స్నేహితుడిపై కేసు నమోదు చేశారు. పోలీసులు సురేష్‌ను అదుపులోకి తీసుకోగా, అతని స్నేహితుడు వేరొక సంఘటనలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురికావటంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. కాగా, జాతీయ రహదారి మీద యువకులు బైక్ పై విన్యాసాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. ప్రచారం కోసం యువకులు బైక్‌లపై వివిధ విన్యాసాలు చేస్తూ ప్రమాదాల బారిన పడవద్దని విజ్ఞప్తి చేశారు.

బాలుడి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

మంగళగిరి సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన బాలుడు ప్రమాదవశాత్తూ గాయపడి చికిత్స పొందుతున్నాడు. గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ప్రతి నిధులు బాలుడి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందించారు. ఎర్రబాలెం ఎస్టీ కాలనీకి చెందిన భువనగిరి జగత్ కల్యాణ్ అనే రెండేళ్ల బాలుడు ఐరన్ గేటు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న గివింగ్ బ్యాక్ టూ సొసైటీ బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలను అందజేసింది. ఈ చెక్కును మంగళవారం తహసీల్దారు దినేష్ రాఘవేంద్ర చేతుల మీదుగా బాలుడి తండ్రి ప్రశాంత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కక్షలు కార్పణ్యాలు పక్కన పెట్టి శాంతియుతంగా జీవించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ మధుపవన్

పెదనందిపాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కక్షలు కార్పణ్యాలు పక్కన పెట్టి శాంతియుతంగా జీవించాలని ఎస్‌ఐ అద్దంకి మధుపవన్ అన్నారు. మండలపరిధిలోని ఉప్పలపాడులో మంగళవారం రాత్రి పల్లెవెలుగు కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్న విషయంలో గొడవలకు దిగి కేసుల నమోదు చేసుకోరాదన్నారు. చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూసుకోవాలని, సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

మంగళగిరి సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని, ఆస్తి ఆధారిత ఇంటి పన్ను విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మకూరులో కరపత్రాలను పంపిణీ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రూ. 15,485 కోట్ల విద్యుత్ భారం, రూ.784 కోట్ల ఆస్తిపన్ను భారాలను మోపిందన్నారు. అమృత్‌సిటీలలో భాగంగా మంగళగిరి ప్రాంతంలో పెద్ద ఎత్తున గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. ఈ స్మార్ట్ మీటర్ల వల్ల భవిష్యత్తులో ప్రజల మీద అదనపు భారం పడుతుందన్నారు. ప్రజలందరూ ఈ విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు మొసలి పకీరయ్య, పండల ప్రసాద్, గడ్డం అజయ్‌కుమార్, చిట్టేల జనార్ధనరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

30 తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలి

తాడికొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేదీలోపు ఆధార్ ఈకేవైసీని డీలర్ల వద్ద చేయించుకోవాలని తహసీల్దార్ మెహర్‌కుమార్ తెలిపారు. మంగళవారం తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో మండల రేషన్ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 5 సంవత్సరాలులోపు పిల్లలకు, 80 సంవత్సరాల వృద్ధుల ఈకేవైసీ చేయించాల్సిన అవసరం లేదన్నారు. రేషన్ కార్డులోని సభ్యుల్లో ఆధార్ అప్‌డేట్ అవ్వని వారి వివరాలు ఆయా డీలర్ల వద్ద లిస్టులు ఉన్నాయని తెలిపారు. డీలర్ల వద్ద ఉన్న లిస్టుల్లో ఉన్నవారు మాత్రమే ఆధార్ ఈకేవైసీ చేయించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ దేవరాజ్, డీలర్లు పాల్గొన్నారు.

బీమా సౌకర్యాలను కలిగి ఉండాలి

ఫిరంగిపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయని, కనుకనే ప్రతి మహిళ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష లాంటి బీమా సౌకర్యాలను కలిగి ఉండాలని ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపాలెంలో భారతీయ రిజర్వ్‌బ్యాంక్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారుల చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. సర్పంచ్ మెల్కియా మాట్లాడుతూ ప్రైవేట్ బ్యాంకుల జోలికి వెళ్లి మోసపోకుండా ప్రభుత్వ బ్యాంకులనే ఆశ్రయించాలని అయన కోరారు. వెలుగు కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ రమాదేవి మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా రుణాలు పొంది సద్వినియోగం చేసుకొని కుటుంబాలను ఆర్థికంగా ఎదిగేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్‌లు షేక్ బాజీ, తురక మంగయ్య, వెలుగు మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చిరంజీవి, యానిమేటర్ పద్మ, మీరమ్మ, ప్రమీల, అలేఖ్య, కమలకుమారి, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఇల్లు పరిశ్రమ కావాలి

● జిల్లా వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ విజయలక్ష్మి

ఫిరంగిపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇల్లు పరిశ్రమ కావాలని రాష్ట్ర ప్రభుత్వం ఆకాంక్షిస్తుందని జిల్లా వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఫిరంగిపురంలోని విజ్ఞానపురంలో జరిగిన డ్వాక్రా మహిళల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని, రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందని ఆమె చెప్పారు. మైక్రో ఫైనాన్స్, స్పందన, షేర్లు వాటి వలలో చిక్కు కొని జీవితాలు పాడు చేసుకోవద్దన్నారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మహిళలు చిన్నచిన్న ఉత్పత్తులు, వ్యాపారాలు, యంత్రాల ద్వారా పెంపొందించుకోవాలని ఆమె కోరారు. వ్యవసాయంతో పాటు జూటు బ్యాగ్‌ల తయారీ, బ్యూటీషియన్, టైలరింగ్, మిల్లెట్, ఫుడ్ ప్రాసెసింగ్, మిల్క్ ప్రొడక్ట్‌లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు వంటి వాటితో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. అంతేగాక సోలార్ సిస్టమ్, కంప్యూటర్ ట్రైనింగ్, డీటీపీ, స్కిల్ డెవలప్‌మెంట్‌లలో ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజన సౌకర్యం కలగజేయనున్నామని ఆమె తెలిపారు. ఏపీఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు సంవత్సరిక అప్పు ప్రణాళిక ద్వారా క్యాంపుల నుంచి రూపాయి వడ్డీతో రుణాలు పొందడానికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీసీ కరీముల్లా, యానిమేటర్ రాయపూడి సౌజన్య, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ, మండల అధ్యక్షుల నియామకం



పడవల మహేష్, పల్లబోతుల శ్రీనివాసరావు, దాసరి కృష్ణ

మంగళగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదేశాల మేరకు మంగళగిరి పట్టణ, మండల, తాడేప ల్లి మండల పార్టీ అధ్యక్షులను నియమించారు. టీడీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడిగా పడవల మహేష్, మండల అధ్యక్షుడిగా కాజ గ్రామానికి చెందిన పల్లబోతుల శ్రీనివాసరావు, తాడేపల్లి మండల అధ్యక్షుడిగా దాసరి కృష్ణలను నియమించినట్టు పార్టీ వర్గాలు ప్రకటించాయి. నూతనంగా నియమితులైన అధ్యక్షులకు పార్టీ నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

పేద విద్యార్థినికి స్ఫూర్తి ఫౌండేషన్ చేయూత



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి

మేడికొండూరు జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబానికి చెందిన విద్యార్థినికి సిరిపురం కేంద్రంగా పని చేస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ చేయూతనిచ్చింది. ఇంటర్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తాడికొండ మండలం పాములపాడుకు చెందిన నేతగాని ప్రవల్లిక రెండో సంవత్సరం ఇంటర్ చదివేందుకు అవసరమైన లక్షా15 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని చెక్కు ద్వారా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ మంగళవారం విద్యార్థినికి సిరిపురంలో అందజేశారు. ప్రవల్లిక తండ్రి 5వ ఏటనే యాక్సిడెంట్‌లో చనిపోగా తల్లి శిరీష కూలి పనులు వెళ్తూ కుమార్తెను చదివించుకుంటున్నది. స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ వాళ్ల కుటుంబ పరిస్థితులు తెలుసుకొని స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్‌కు, ప్రతినిధులకు తెలియజేశారు. ప్రవల్లిక చదువు పూర్తయ్యేంత వరకు ఫౌండేషన్ అండగా ఉంటుందని చైర్మన్ శ్రీవ్యాల్ హామీ ఇచ్చారు. తమ పరిస్థితిని అర్థం చేసుకొని వెంటనే సహాయం చేసిన చైర్మన్ శ్రీవ్యాల్, డైరెక్టర్ శిరీష తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆత్మకూరు జగన్ కాలనీలో స్పెషల్ డ్రైవ్

మంగళగిరి సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఎంటీఎంసీ అధికారులు మంగళవారం ఆత్మకూరు గ్రామంలోని జగన్‌కాలనీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కాలనీ వాసులు అనేక సమస్యలను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి విషసర్పాలు సంచరిస్తున్నాయని, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండటం లేదని, డ్రెయినేజీ, రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని కాలనీవాసులు విన్నవించారు. తక్షణమే స్పందించిన మంత్రి లోకేశ్ వెంటనే కాలనీలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది మంగళవారం ఉదయం జగన్ కాలనీలో పర్యటించారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించారు. పారిశుధ్యం, విద్యుత్, తాగునీటి వసతుల మెరుగుదలకు చర్యలు తీసుకున్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

తహసీల్దార్ కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

పెదనందిపాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల తహసీల్దార్ హెనప్రియను మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. మండలంలోని పలు సమస్యలు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నాయకులు కారుమూరి అంకయ్య, పాలపు రమేష్, టైనర్, పల్లెపాగ పాపారావు, కొండెపాటి సుజాత తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పెదనందిపాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో యోగాంధ్రను సక్రమంగా నిర్వహించాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా మురుగు కాలువల పూడికతీత పనులు చేపట్టాలని, క్లోరినేషన్ చేసిన నీటినే ప్రజలకు అందించాలని సూచించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

తెనాలి మండల వ్యవసాయాధికారిగా సుధీర్‌బాబు బాధ్యతల స్వీకారం

తెనాలి, మారీసుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తెనాలి మండల వ్యవసాయాధికారిగా కె.సుధీర్ బాబు బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం చెంచుపేట మార్కెట్ యార్డు ప్రాంగణంలోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవోగా కె.సుధీర్‌బాబు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో రైతు సేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ 90శాతం పూర్తయిందని మిగిలిన వారు తప్పకుండా రైతు సేవా కేంద్రానికి రైతులు వచ్చి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూసారాన్ని కాపాడాల్సిన బాధ్యత రైతులపై ఉన్నదని విచ్చలవిడిగా ఎరువులు, క్రిమిసంహారక మందులను వినియోగించడం ఆపాలన్నారు. అవి తాత్కాలికంగా పంట దిగుబడిని అందించిన తరువాత వేయబోయే పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. సరైన మోతాదులో మాత్రమే పంటలకు ఎరువులను సిఫార్సు చేసిన మేరకే వాడాలని సూచించారు. అన్ని రైతు కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధీర్‌బాబు పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులతో కలసి నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, ఆదర్శ రైతులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిల్కారి కాల్ సేవలను సద్వినియోగం చేసుకోండి

● ప్రోగ్రాం ఆఫీసర్ రాజు

తెనాలి, మారీసుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిల్కారి కాల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రాం ఆఫీసర్ రాజు అన్నారు. మంగళవారం స్థానిక గంగానమ్మపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో కిల్కారి ప్రోగ్రాం ఆఫీసర్ రాజు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లుకు కిల్కారి కాల్ సేవలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిల్కారి కాల్ ప్రోగ్రాం గర్భిణీ, బాలింతలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కిల్కారి కాల్ ద్వారా తల్లీ, బిడ్డల ఆరోగ్య సమాచారం అందిస్తారన్నారు. గర్భిణీ 4వ నెల మొదలుకొని బిడ్డ పుట్టిన సంవత్సరం వరకు నమోదు చేస్తామన్నారు. వారానికి ఒకసారి గర్భిణులు, బాలింతలకు కేంద్ర ప్రభుత్వం నుంచి కిల్కారి కాల్ 01244451660 నంబర్ నుంచి ఫోన్లు వస్తాయన్నారు. ఈ నెంబర్‌ను గర్భిణులు, బాలింతలు తమ మొబైల్ ఫోన్లలో సేవ్ చేసుకుని ఫోన్ వచ్చినప్పుడు పూర్తి సమాచారాన్ని వినవచ్చన్నారు. సమాచారం తిరిగి వినాలంటే 14423 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి వినవచ్చన్నారు. ఈ సేవలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, ఎస్‌టీఎస్ రవికుమార్, హెచ్‌వీ విజయకుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట,జూన్ 17 (ఆంధ్రజ్యోతి): దారి కాచి దాడి చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా చుండూరు గ్రామానికి చెందిన కూచికపూడి వేణుబాబు వ్యవసాయ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం వ్యక్తిగత పనులపై తన ద్విచక్రవాహనంపై తెనాలి వచ్చాడు. పనులు పూర్తిచేసుకొని కొత్తపేటలో వెళ్తున్న క్రమంలో నాజరుపేటకు చెందిన గుమ్మడి శ్రీనివాసు తన కారును అడ్డుపెట్టి వేణుబాబుపై దాడిచేసి గాయపర్చాడు. బాధితుడు వేణుబాబు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

జీఎస్‌టీ వసూళ్లకు సహకరించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జీఎస్టీ (రాష్ట్ర పన్నుల) వసూళ్ల మరింత మెరుగ్గా జరిగేలా రిజిస్ట్రేషన్స్, రిటర్న్స్, కలెక్షన్స్‌కు అన్ని ప్రభుత్వ శాఖలు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తి స్థాయిలో సహకారం అందించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో జీఎస్‌టీ వసూళ్లపై రాష్ట్ర పన్నుల శాఖతో జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర పన్నుల ఆదాయం పెంపుదలలో భాగంగా జిల్లాలో గూడ్స్ సర్వీస్ రంగాల నుంచి జీఎస్టీ సక్రమంగా వసూలు జరిగేలా రాష్ట్ర పన్నుల శాఖకు జిల్లా శాఖలు సహకరించాలన్నారు. జీఎస్టీ పన్ను చెల్లించని వ్యాపారుల నుంచి రికవరీ చేయడానికి బ్యాంకులు అవసరమైన సమాచారాన్ని జీఎస్టీ శాఖకు అందించాలన్నారు. మైనింగ్, రవాణ వంటి రంగాలలోని వ్యాపారులు పన్ను ఎగవేతకు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఆదాయం పెంపుదలకు కాంట్రాక్టర్లు స్థానికంగా వనరుల సేకరణను ప్రోత్సహించేలా దిశ నిర్దేశం చేయాలన్నారు. జీఎస్టీ (రాష్ట్ర పన్నుల) గుంటూరు డివిజన్-1 జాయింట్ కమిషనర్ డీ.శ్రీలక్ష్మి, డివిజన్-2 జాయింట్ కమిషనర్ బీగీతామాధురి డివిజన్ పరిధిలోని సర్కిల్స్ వారీగా ఉన్న గూడ్స్, సర్వీస్ రంగాలకు చెందిన పన్ను వసూళ్ళు జీఎస్టీ వసూళ్ళు మెరుగుదలకు ప్రభుత్వ శాఖల నుంచి అందించాల్సిన సమాచారం, సహకారంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులు, జడ్పీ సీఈవో జ్యోతి బసు, నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జ్ కమిషనరు ఓబులేషు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్ రెడ్డి, పంచాయితీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, జలవనరులు, ఆర్ అండ్‌బీ, వైద్యారోగ్యశాఖ, మున్సిపల్, విద్యుత్, మైనింగ్, పీసీబీ, అధికారులు పాల్గొన్నారు.

చివరి భూములకు సాగునీరు అందించడమే లక్ష్యం

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



పంట కాల్వల్లో పూడికతీత పనులను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పండించపోయే వరి పంటకు చివరి భూములకు కూడా సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చక్రాయపాలెం, దావులూరు, కొల్లిపర గ్రామాల్లో జరిగే పంట కాల్వల పూడిక తీత పనులను అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో కలిసి పరిశీలించారు. పూడికతీత పనులపై రైతులతో చర్చించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఖరీఫ్ దగ్గర పడుతుందని కాబట్టి పంటకాల్వల పూడిక తీత పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ దిగువ ప్రాంతాల్లోని పంట కాల్వల్లో ప్లాస్టిక్ వంటి వ్యర్థాలు నిలిచిపోవడం వలన సాగునీరు ముందుకు కదలక రైతులు పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తెనాలి మండలంలో పంటకాల్వలపై దృష్టిపెట్టి కోటి 47లక్షల రూపాయలతో 47కిలో మీటర్లు మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు. కొల్లిపర మండలంలో కూడా కొల్లిపర చానల్, చక్రాయపాలెం దగ్గర బురిపాలెం చానల్, దావులూరు చానల్స్‌లో కాల్వల పూడికతీత పనులు జరుగుతున్నాయన్నారు. వీటితో పాటు రైతులు డొంకరోడ్లు మరమ్మతులు చేయమని తనదృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ సంవత్సరం రూ.10కోట్లతో డొంక రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీ వైస్‌చైర్మన్ తోట ఏడుకొండలు, ఇరిగేషన్ ఏఈ రవిబాబు, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, నీటి సంఘ అధ్యక్షుడు బి.శ్రీరాములరెడ్డి, కోటా వీరాంజనేయులు, మాజీ మండల ఉపాధ్యక్షుడు అడపాల నాగేశ్వరరావు, ఎంపీటీసీ హరికృష్ణ, నీటి సంఘం ఉపాధ్యక్షుడు కట్టా శ్రీహరిరెడ్డి, నాయకులు అడపా నారాయణరెడ్డి, అద్దంకి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

కొల్లిపర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపర పాల ఉత్పత్తిదారుల కల్యాణ మండపంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద యంత్రపరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి ఎన్. శ్రీనివాస రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రతి రైతును ఆదుకోవడం జరిగిందన్నారు. సన్న బియ్యాన్ని కొనుగోలు చేయడం వలన మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో కనీసం తైవాన్ స్ప్రేయర్లు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో రైతులను అన్నివిధాలా ఆదుకోవడం జరిగిందన్నారు. తల్లికి వందనం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటిలో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి నగదును జమ చేయడం జరిగిందన్నారు. మరో నాలుగు ఐదు రోజుల్లో అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా రైతుల ఖాతాల్లో నగదును జమ చేయడం జరుగుతుందని తెలియజేశారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయంగా పని చేస్తుందన్నారు. కొల్లిపర మండలానికి పూర్వవైభవం తీసుకురానున్నట్లు తెలియజేశారు. అనంతరం 62 మంది రైతులకు 27లక్షల6వేల 973రూపాయల విలువగల యంత్రపరికరాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, డీసీ వైస్‌చైర్మన్ తోట ఏడుకొండలు, వివిధ శాఖాధికారులు, నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, అడపా నారాయణరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు తైవాన్‌స్ప్రేయర్లను పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

పడమర కాల్వలో గుర్రపు డెక్క, వ్యర్థాల తొలగింపు

తెనాలి అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డివిజన్ పడమర కాల్వలో గుర్రపు డెక్క, తూటికాడ వ్యర్థాల తొలగింపు చేపట్టారు. కూచిపూడి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొరటాల లీలాసత్యసాయి జరుగుతున్న పనులను మంగళవారం పర్యవేక్షించారు. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల నుంచి వైకుంఠపురం వరకు ఈ కాల్వ పట్టణ ప్రజలు వేస్తున్న వ్యర్థాలు, మురుగు, తూటికాడ, గుర్రపుడెక్కతో పూడిపోయింది. రెండు జేసీబీలు వినియోగించి వారం రోజులుగా వ్యర్థాల తొలగింపు చేపట్టామని ఆయన చెప్పారు. వ్యర్థాలు ఎంతగా ఉన్నాయంటే జేసీబీ కాల్వలోకి దిగే అవకాశం లేకపోవడంతో తాటి బొత్తలు వేసి వాటిపై జేసీబీ ఉంచి పని చేయిస్తున్నామని చెప్పారు. ఈ కాల్వనుండి తెనాలి, చుండూరు, పిట్టలవానిపాలెం, అమృతలూరు తదితర మండలాల్లోని వేలాది ఎకరాల భూములకు సాగునీరు అందడంతో పాటు గ్రామాల్లో తాగునీటి పథకాలకు అవసరమైన నీటిని చెరువులకు నింపుకుంటారు. ఆ చెరువులోని నీటిని శుద్ధిచేసి పలు గ్రామాల్లో తాగు, వాడుక అవసరాలకు వినియోగిస్తుంటారు. కాల్వ వెంబడి ఉండే ప్రజలు వ్యర్థాలు వేయకుండా రైతులకు సహకారం అందించాలని ఆయన కోరారు. తగినన్ని నిధులు లేకపోయినప్పటికీ రైతుల కోసం పూడిక పని చేపట్టామని చెప్పారు. ఆంజనేయ చౌదరి పాల్గొన్నారు.



పడమర కాల్వలో గుర్రపు డెక్క, తూటికాడ పూడికతీత పనులను పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ లీలాసత్యసాయి

ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ నిరసన

పెదకాకాని, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనా, ఇరాన్‌లపై అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు నిరసనగా సీపీఎం, సీపీఐ వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రమైన పెదకాకాని ప్రధాన కూడలిలో నిరసన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ ఇజ్రాయిల్ ఆరు నెలల్లో పాలస్తీనాపై చేసిన దాడుల్లో 52,000మంది పౌరులు మృతి చెందారన్నారు. అమెరికా అండ చూసుకొని నేడు ఇరాన్‌పై కూడా దాడులకు తెగబడటం అంటే హేయమైన చర్య అన్నారు. ఇరాన్‌లోని పెట్రోల్ ఉత్పత్తులపై దాడులుచేసి పెట్రోల్ కొరతను సృష్టించి ప్రపంచాన్ని ఇబ్బందులు పెట్టే పరిస్థితులు ఉన్నాయన్నారు. భారత ప్రభుత్వం కలుగజేసుకొని యుద్ధ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పి.సత్యనారాయణ మాట్లాడుతూ అమెరికా ఉక్రెయిన్, ఇజ్రాయిల్‌లను రెచ్చగొట్టి రష్యా, పాలస్తీనా, ఇరాన్లపై దాడులు చేయిస్తోందని అమెరికా సామ్రాజ్యవాద పోకడలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యుద్ధ పిపాసి ట్రంప్ వైఖరి ప్రపంచ దేశాలన్నింటికీ అర్థమయిందన్నారు. ఇజ్రాయిల్ జనావాసాలపై దాడులు హర్షించదగ్గ పరిణామం కాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుక్కల రాఘవయ్య, ఉల్లంగుల శివయ్య, కె.సత్యనారాయణ, ఎస్.నీలాంబరం, సీపీఐ నాయకులు మహిళా సమైఖ్య గుంటూరు జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం కార్యదర్శి కేతినేని అగస్టీన్, గ్రామ కార్యదర్శి డేవిడ్‌రాజ్, దర్శి లింగారావు, గోపి సుబ్బారావు, ఆర్ శ్రీనివాసరావు, దుర్గ, సీహెచ్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పెదకాకాని ప్రధాన కూడలిలో నిరసన తెలియజేస్తున్న వామపక్షాల నాయకులు

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, జూన్, 17 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను తక్షణమే నిలిపివేయాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఐలాండ్ సెంటర్లో ఇజ్రాయెల్ మారణహోమానికి వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు ఇజ్రాయెల్ దాడులను ఆపకుంటే ప్రపంచశాంతి కనుమరుగైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధాలకు వ్యతిరేకంగా రూపొందించిన కరపత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ జానీ, కమల్‌బాషా, ప్రసాద్, షేక్ వలీ, ఫరీద్, బాషా, లక్ష్మయ్య, గోపీ, రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాకు సంఘీభావం తెలపాలి

తెనాలి అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఖండించి పాలస్తీనాకు ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలని ఇస్కఫ్ జిల్లా అధ్యక్షురాలు బి.నాగమణి కోరారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, పాలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న యుద్ధంలో భారత ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలన్నారు. శ్రీదేవి, మోహనరావు, కృష్ణ, బెన్‌హర్, అనురాధ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మీపతిరావు, పక్కన ఆర్వో రాంప్రసాద్, ఏసీపీ శివన్నారాయణ తదితరులు

యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

● మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రేపు గురువారం జరగనున్న యోగాంధ్ర ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ఎంఈవో లక్ష్మీనారాయణతో కలసి యోగాంధ్ర ప్రత్యేక కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా ఈ నెల 19 మున్సిపల్ కార్యాలయం ఎదుట యోగాంధ్ర మెగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో 500మంది విద్యార్థులతో ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఇందులో వివిధ శాఖల అధికారులు, రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ రాంప్రసాద్, ఏసీపీ శివన్నారాయణ, ఎంఈవో లక్ష్మీనారాయణ, వివిధ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా వ్యాధిపై అవగాహన ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలి, మారీసుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. మంగళవారం మారీసుపేట లక్ష్మీనగర్‌లో జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం అధికారులతో కలసి మలేరియా నివారణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధుల వ్యాప్తికి ముఖ్యంగా దోమలు కారణమవుతున్నాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. మారీసుపేటలోని నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మలేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాలు, ఉపాధ్యాయులతో మలేరియా రహిత భారత దేశాన్ని సాధిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలో మలేరియా నివారణ కరపత్రాలను పంచుతూ మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ కరీముల్లా, ఎన్‌సీసీ ఆఫీసర్ పులి భాస్కరరావు, ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, గ్రామీణ సబ్ యూనిట్ అధికారి వి.పున్నారెడ్డి, పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె చంద్రమౌళి, ఎస్‌హెచ్‌వో జి.రవికుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు డి.శ్రీనివాసరావు, డి.నాగమల్లేశ్వరావు, బి.మల్లేశ్వరావు, టి.శివరాంప్రసాద్, రషీద్, నవీద్, కరిముల్లా, వేణుగోపాల్, శరత్ బాబు, రత్నాకరరావు, బాషిద్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మలేరియా మాసోత్సవ ర్యాలీలో పాల్గొన్న జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం, బాలచంద్రమౌళి తదితరులు



చంద్రబాబు, నరేంద్రకుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ముస్లిం మహిళలు

పేద కుటుంబాల్లో విద్యా వెలుగులు

● టీడీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్, 17 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం నిధులను ఖాతాల్లో జమచేయడంతో పేదల కుటుంబాల్లో విద్యా వెలుగులు విరబూస్తున్నాయని టీడీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ అన్నారు. పొన్నూరు పట్టణంలోని మార్కెట్ సెంటర్లో మంగళవారం టీడీపీ మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో తల్లికి వందనం నిధులు జమచేసిన సందర్భంగా ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం మహిళలు పాలాభిషేకం నిర్వహించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్‌సిక్స్ ఎన్నికల హామీలను అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే ఉచిత వంట గ్యాస్, పెన్షన్ల పెంపు వంటి హామీలను అమలు చేశారని గుర్తుచేశారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా నిధులు జమచేస్తామని హామీ ఇస్తే ప్రతిపక్షం అసత్య ప్రచారాలు చేసిందన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్క రోజులో రూ.10వేల కోట్లు ఈ పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమచేసి ప్రతిపక్షానికి విమర్శలు చేసే అవకాశం లేకుండా చేశారన్నారు. మైనార్టీలలో అత్యధికమంది పేద చిన్నారులు విద్యలేక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారన్నారు. పేద విద్యార్థులందరికీ నిధులు జమచేయడంతో పేద మైనార్టీ విద్యార్థుల విద్యకు ఆటంకం లేకుండా పోయిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, పఠాన్ సైదుల్లాఖాన్, షేక్ బాజీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ సాహెబ్, రియాజ్, సుల్తానా, గౌసియాబేగం, అమీద్, బాలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోలీసులతో సమీక్ష నిర్వహిస్తున్న మెజిస్ట్రేట్ రుక్మిణి

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

పొన్నూరు టౌన్, జూన్, 17 (ఆంధ్రజ్యోతి): జూలై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, మెజిస్ట్రేట్ జి.రుక్మిణి ఆదేశించారు. స్థానిక సివిల్ కోర్టులో మంగళవారం పోలీసు, ఎక్సైజ్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజీపడదగిన అన్ని రకాల కేసులను ఈ లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించి కక్షిదారులకు సమయాన్ని ఆదా చేయాలని సూచించారు. సమావేశంలో టౌన్ సీఐ వీరానాయక్, రూరల్ ఎస్ఐ కిరణ్ బాబు, కాకుమాను ఎస్ఐ ఏకనాథ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ నోడల్ ఆఫీసర్ తులసీరామ్

పీఎం సూర్యఘర్ లక్ష్యాలను అధిగమించాలి

● నోడల్ ఆఫీసర్ పీవీ తులసీరామ్

పొన్నూరు టౌన్, జూన్, 17 (ఆంధ్రజ్యోతి): గృహాలపై సోలార్ పవర్ ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ ప్రాథమిక లక్ష్యాలను అధిగమించాలని విద్యుత్ శాఖ బాపట్ల డివిజన్ నోడల్ ఆఫీసర్ పీవీ తులసీరామ్ అన్నారు. పొన్నూరు సబ్‌స్టేషన్‌లో మంగళవారం పీఎం సూర్యఘర్ పథకంపై సమీక్ష జరిగింది. నోడల్ ఆఫీసర్ తులసీరామ్ మాట్లాడుతూ ఈ పథకం కింద పొన్నూరు పట్టణంలో 352, మండలంలో 451, పెదనందిపాడులో 317, కాకుమానులో 315 సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యనిర్దేశం చేసినట్లు తెలిపారు. ఈ పథకం కింద గరిష్ఠంగా 38వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అదనంగా 20వేలు రాయతీ, ఎస్సీలకు ఉచితంగా ఈ పథకం అమలు చేసేలా సర్వే చేసినట్లు తెలిపారు. పొన్నూరు పట్టణంలో 2122 గృహాలు, మండలంలో 1108 గృహాలు, పెదనందిపాడులో 1994, కాకుమానులో 2153 ఎస్సీ గృహాలను గుర్తించినట్లు వివరించారు. ఇప్పటి వరకు 137మంది పీఎం సూర్యఘర్ ఉపయోగించుకోగా 124 మందికి సబ్సిడీ విడుదల అయినట్లు తెలిపారు. జూన్ నెల పూర్తయ్యే నాటికి 1435 లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏడీఈ వెంకటేశ్వరరావు, ఏఈలు, వెండార్లు తదితరులు పాల్గొన్నారు.



ఈ కేవైసీ చేయిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

రైతులు ఈకేవైసీ నమోదు చేయించుకోవాలి

పొన్నూరు టౌన్, జూన్, 17 (ఆంధ్రజ్యోతి): రైతులు అన్నదాత సుఖీభవాకు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని మాచవరం రైతు సేవా కేంద్రంలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కౌలురైతులు రుణ అర్హత కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి ఐ శ్రీకాంత్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.